
చందమామ
అక్టోబర్ 1961
5

ప్రఖ్యాత "ఉమా" బ్రాండు బంగారు కవరింగు నగలనే కొనండి. బంగారు కవరింగు "ఉమా" లాకెటు చైన్లను స్త్రీ, పురుషులకు, బాల, బాలికలకు ఉపయోగించుకొనండి.

అనేక సంవత్సరములు మన్నిక యుండి తృప్తి నిచ్చును

సామాన్య వి. పి. పార్సెలు చార్జి రు. 1-37

ఉమా గోల్డు కవరింగు వర్క్సు

హెడ్డాఫీసు: ఉమామహల్, మచిలీపట్టణము

ఉమా గోల్డు కవరింగు వర్క్సు పోస్టాఫీసు

UMA 1036-958
CHAIN WITH MARY WITH CHILD DOLLER
Rs. 7-50

UMA 1037-957
CHAIN WITH SITA RAMA LAKSHMANA & HANUMAN DOLLER
Rs. 7-50

UMA 1038-714
CHAIN WITH HANUMAN DOLLER
Rs. 7-50

UMA 1039-961
CHAIN WITH SRI RAMA PATTABHISHEKAM DOLLER
Rs. 7-00



మా విక్రయశాలలు:

90 - చైనాబజారు రోడ్డు, మద్రాసు - 1

581 - శివాలయం వీధి, విజయవాడ

104 - అవెన్యూ రోడ్డు, బెంగళూరు సిటి

చందమామ

ఈ సంచికలో కథలు - వింతలు - విశేషాలు

ఇవి గాక ఫొటోశీర్షికల పోటీ, మరి ఎన్నో ఆకర్షణలు.

గృహిణి పరువు, ప్రతిష్ఠలు...

సరిగా టీ వేళకు వాళ్లు వచ్చారు పిచ్చాపాటీ మాట్లాడుకునేందుకు. వారికి ఏమైనా పెట్టుదామంటే ఆమెకు ఏమీ అగుపించలేదు....ఇంతలో ఆయన ఆమె చెవిలో ఏమో ఊదారు.

వెంటనే ఆమె గిరుక్కున లోపలికి వెళ్లి, ట్రే నిండా సాతేవారి బిస్కత్తులు పెట్టుకుని వచ్చింది. రుచికరమైన ఆరెంజ్ క్రీమ్, తాజా వాసనవేస్తున్న మాల్టెక్స్, మ్రూస్‌బెరీ....కరకరలాడే సాల్టెక్స్ స్నాక్స్ కూడా వున్నవి. ఇవి ఆ రోజుకు ఆ గృహిణి పరువు ప్రతిష్ఠలను కాపాడినవి.



సాథే బిస్కత్తులు

సాతె బిస్కట్ & చాకొలెట్ కంపెనీ లిమిటెడ్ పూనా-2

పాఠకుల లేఖలు

అక్టోబర్ 1961

"రాకాసిలోయ" చాలా బాగున్నది. "సైమన్" కథ అయిపోయినందుకు విచారిస్తూ, యింకా యిటువంటి కథలు వేస్తారని సంతోషిస్తున్నాను.

—చీదెళ్ల నరసింహమూర్తి, సింగరాయకొండ

సీరియల్స్ చక్కగా నుంటున్నవి. "రాకాసిలోయ" చాలా కుతూహలం కలిగిస్తున్నది. "చందమామ" నేస్తంకు నా హృదయపూర్వక ధన్యవాదాలు అంద చేస్తున్నాను.

—యస్. సీత, ఆత్రేయపురం

ఈ నెల "చందమామ" చాలా ఆకర్షణీయముగా ఉంది. "అపరాజిత", "నీతిపదులు", "సైమన్", "ఖలీఫా కనువిప్పు", సీరియల్ కథలు చాలా బాగున్నవి.

—దారా భాస్కర్, విజయనగరం

"చందమామ"లో ప్రచురించు కథలు మరుపు రానివి. ఈ నెల ముఖ్యంగా "అపరాజిత," "ఖలీఫా కనువిప్పు", చదివి ఎంతో సంతోషిం చాను. "సైమన్" ఎన్నిసార్లు చదివినా తనివి తీరుటలేదు.

—వారణాసి సూర్యారావు, మీనవిల్లూరు

"అర్థములేని అనుమానాలు" అను కథ చాలా బాగున్నది. "చందమామ"కు ఈ కథవలన చాల కళ వచ్చినది.

—మాష్టూరి వీరభద్రరావు, కాకినాడ

"దకయజ్ఞం" మహా శ్రేష్ఠకరమైన రచన. ఆధునిక కవులలో శ్రీమాన్ ఉత్పల సత్యనారా యణగారే అట్టి రచనలు చేయగల సమర్థులు.

—రజనీకాంత్, సికింద్రాబాదు



ఎక్కడ లైఫ్‌బాయ్ వున్నదో,
అక్కడ ఆరోగ్యము వున్నది!

లైఫ్‌బాయ్ నురుగుతో స్నానంచేసి, ఆనంద పరవశులై పొండి! అది మీకు ఆరోగ్యవంతమైన హాయి గొలుపుతుంది! లైఫ్‌బాయ్ మురికిలో వున్న క్రిములను కడిగివేస్తుంది... కుటుంబములో అందరూ లైఫ్‌బాయ్ వాడుటవల్ల ఆరోగ్యవంతంగా వుంటారు!

L.23-X29 TL

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

'ఆయనను మెప్పించుట అంత సులభంకాదు...'

బొంబాయి 16, మహిమ్ లోని 8, యూనియన్ పార్క్ లో ఉంటున్న శ్రీమతి. ఆర్.ఆర్. ప్రభు ఇలా చెప్పుతున్నారు:
'ఆయనకేదీ మెచ్చరేదు. ఇంక ఇల్లా సంతోషపెట్టడం ఎలాగో...!'
అప్పుడు ఆయన బట్టలన్నిటినీ సన్‌లైట్ తో ఉతుకుతున్నాను...' ఆయనకూ, నాకూ పరమానందం! సన్‌లైట్ సమృద్ధిగా నురగ నిస్తుంది. ఉతికే పని దాంతో సులభం!
'నేను ఉతికేవన్నీ తెల్లగాను, కాంతిగాను ... పరిశుభ్రంగా వుంటాయి! నాకు సన్‌లైట్ తప్ప మరేదీ వద్దు!'

సన్‌లైట్




మీ బట్టలకు వరప్రసాదం!

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

S.30-X29 TL





చందమామ

సంపాదకుడు : 'చక్రపాణి'

ఈ సంచిక నుంచి "భారత చరిత్ర" నెలనెలా ప్రచురిస్తున్నాము. స్వతంత్ర భారతంలో ప్రతి పౌరుడూ చరిత్ర జ్ఞానం కలిగిఉండాలి. ఆ ఉద్దేశంతో "చందమామ" పాఠకులకు భారత చరిత్రను అందించ నిశ్చయించాము. చరిత్రలో కూడా ఎన్నో తెలుసుకోవలసిన విజ్ఞాన విషయాలూ, రస మయ ఘట్టాలూ ఉంటాయి. పాఠకులు ఈ శీర్షికను శ్రద్ధతో చదువుతారని మా ఆశ.

"చందమామ"లో నెలనెలా ప్రచురితమయే గేయకథా, సీరియల్ కథలూ, బేతాళ కథలూ, "గుండు భీమన్న" కథలూ, మనదేశపు అద్భుతాలూ, పిట్ట కథలూ, పాఠకుల లేఖలూ, ప్రశ్నోత్తరాలూ పాఠకుల ఆదరానికి పాత్రం అవుతూ ఉండటం మా కెంతో ఉత్సాహాన్నిస్తున్నది.

రాబోయే సంచిక "దీపావళి ప్రత్యేక సంచిక." మామూలు కంటె పేజీలు అధికంగా ఉంటాయి. అందులో కొన్ని సరి కొత్త ఆకర్షణలుకూడా ఉంటాయి.

సంపుటి 29 : అక్టోబర్ 1961 : సంచిక 4



భారత చరిత్ర



మనది భారతదేశం. ప్రాచీనకాలంలో దీన్ని భారతవర్షం అనేవారు. అటు తరవాత పర్షియనులు దీనిని హిందూదేశమన్నారు. "హిందు" అనేమాట సింధు అనేమాటకు రూపాంతరం. మనదేశపు నాగరికత సింధు ప్రాంతంలో మొదటగా వెలిసినందున ఈ పేరు ఏర్పడింది.

ఈ మన భారతదేశంయొక్క విస్తీర్ణం సుమారు 12,60,000 చదరపు మైళ్లు. ఈ విస్తృతమైన దేశంలో ఉత్తరాన ఎల్లప్పుడూ మంచుకప్పిన శిఖరాలుగల కొండలున్నాయి; మధ్యలో నిర్జనమైన ఎడారి ఉన్నది; నదుజల సమృద్ధిగలిగి సారవంతమైన భూములున్నాయి; దుర్గమములైన అరణ్యాలున్నాయి.

ఈ దేశపు ప్రజలలోకూడా కేవలం మృగాలను వేటాడి, అరణ్యంలో దొరికే సంపద మీద ఆధారపడి బతికే ఆటవికులు మొదలుకొని, అత్యుత్తమమైన నాగరికతను అలవరుచుకున్నవారూ, జాను లూ పర కూ అనేకరకాల మనుషులున్నారు.

మనదేశం ఏనాడూ ఒకటిగా లేదని, ఫలాని కాలంలో ఫలాని చక్రవర్తి ఫలాని ప్రాంతాలను ఏకచ్ఛత్రం కిందికి తెచ్చాడని, కిందటి శతాబ్దంలో బ్రిటిషువారే దేశాన్నంతా ఒకటిగా చేశారని కొందరనేది నిజంకాదు.

"ఉత్తరం యత్ సముద్రస్య
హిమాద్రేశ్చైవ దక్షిణం,
వర్షం తద్ భారతం నామ
భారతీ యత్ర సంతతిః"

అని విష్ణుపురాణ శ్లోకాన్నిబట్టి హిమాలయాలకు దక్షిణంగానూ, సముద్రానికి (హిందూ మహా సముద్రానికి) ఉత్తరంగానూ ఉండే భూమి యావత్తూ భారతదేశమని, అందుండే వారందరూ భరతుడి సంతతి వారేనని ఆనాడే భావించారు.

1. అనాగరిక యుగం



తరువాత వచ్చినవారుకూడా భారత దేశపు ఐక్యతను సంశయించటం ఏనాడూ జరగలేదు. క్రీస్తుకు పూర్వం 3వ శతాబ్దంలో ప్రాకృతభాష భారతదేశపు అన్ని ప్రాంతాల వారికీ తెలుసు.

దేశమంతటినీ ఒకే సంస్కృతి కలిపి ఉంచిందనటానికి రామాయణ, మహా భారతాలే నిదర్శనం. ఈ గొప్ప గ్రంథాలను కాశ్మీరం నుంచి కన్యాకుమారి వరకూ, సింధూనదీ ప్రాంతం నుంచి బ్రహ్మపుత్రా నదీ ప్రాంతం వరకూ గల ప్రజలందరూ పఠించి ఆనందించారు. వేదపురాణాలు అందరికీ ఆదర్శప్రాయంగానే ఉండేవి. శివకేశవుల ఆలయాలూ, అర్చనా అన్ని ప్రాంతాలలోనూ జరిగేది.

ఇలాటి భారతదేశంయొక్క చరిత్ర తాలూకు ప్రధానాంశాలు అందరూ తెలుసుకోదగినవి.

* * *

మన దేశంలో ఉండిన అత్యంత ప్రాచీనులు పూర్వ శిలా యుగానికి చెందినవారు. వీరు ఒకప్పుడు మనదేశంలో నివసించినట్లు ఆధారమేమంటే వీరు ఉపయోగించిన మొరటైన రాతి పనిముట్లే. ఇలాటి పనిముట్లు చెంగల్పట్టు జిల్లాలోనూ ఇంకా



శిలాయుగపు పనిముట్లు

అనేక చోట్ల దొరికాయి. ఈ రాతి పనిముట్లు వాడినవారు పశుప్రాయంగా జీవించినవారు. వారికి వ్యవసాయంగాని, కుండలు చెయ్యటంగాని తెలియదు.

నవీన శిలాయుగానికి చెందిన మనుషులు దేశం అన్ని ప్రాంతాలా నివసించారు. వీరి పరికరాలు అనేకచోట్ల ఉన్నాయి. ముఖ్యంగా బళ్లారి ప్రాంతంలో జరిగిన తవ్వకాలలో ఒక కార్ఖానాలాటిది బయట పడింది. ఆ కార్ఖానాలో రాతి పనిముట్లు తయారయేవి. పనిముట్లు చెయ్యటం ఒక పరిశ్రమగా అభివృద్ధి అయిందన్నమాట.

నవీన శిలాయుగపు జీవితంలో క్రమంగా అనేకరకాల అభివృద్ధి కనిపిస్తుంది. వారు వ్యవసాయం నేర్చుకుని ధాన్యాలూ, ఫలాలూ పండించారు. ఎద్దు మొదలైన జంతువులను పెంచటం నేర్చుకున్నారు. కుండలు చెయ్యటం నేర్చుకున్నారు. మొదట్లో వీటిని చేత్తో చేసేవారు. తరవాత కుమ్మరిసారె కూడా వచ్చింది. వీరు గుహలలో నివసించి తమ నివాసాల గోడలమీద వేటకు సంబంధించిన చిత్రాలూ, నృత్యానికి సంబంధించిన చిత్రాలూ వేశారు. ఇలాటి గుహలు కొన్ని ఇప్పటికీ ఉన్నాయి. వారు తమ మట్టి పాత్రలకు అలంకరణాలూ, రంగులూ అమర్చారు. పడవలు తయారు చేసి వాటిలో సముద్రం మీదికి వెళ్ళారు. పత్తి, ఉన్ని వడికి ఆ దారాలతో బట్టలు నేశారు. వారు చనిపోయిన వారిని పాతిపెట్టేవారు. తరవాత లోహయుగపు సంస్కృతి ఆరంభమయింది.

లోహయుగంలో మొదట వాడుకలోకి వచ్చినది రాగి; తరవాత కంచూ, ఆ తరవాత ఇనుమూ వాడుకలోకి వచ్చాయి. భారతదేశంలో జరిగిన సాంఘిక పరిణామంలో "కంచు యుగం" అనేదిలేదు. ఉత్తర భారతంలో కొంతకాలం రాగి వాడుకలో ఉండి, తరవాత ఇనుము వచ్చింది.

దక్షిణ భారతంలో మటుకు మనుషులు శిలాయుగం నుంచి బయట పడుతూనే ఇనుమును వాడుకలోకి తెచ్చారు.

భారతదేశ చరిత్రకు లిఖితరూపమైన ఆధారాలు ఋగ్వేదకాలంనుంచీ లభిస్తున్నాయి. ఋగ్వేదం లోహయుగంలోనే పుట్టింది. ఇది రాసిననాటికి ఇనుము వాడుకలోకి వచ్చి ఉండవచ్చును. అయితే రాగి యుగం నాటికే సింధు లోయలో ఒక అద్భుతమైన నాగరికత వెలిసింది. దీనిని గురించి పై మాసంలో తెలుసుకుందాం.





దేవర్షి లోక దర్శనము

చతుర్థాశ్వాసము :

పండు వెన్నెల పోత పోసిన
కొండగా రూపొందినట్టులు
శివు నివాసము, సిద్ధగుహ్యక
సేవితము, కైలాస మల్లదె!

వెండి కొండల చరియలందున
వేడ్కతో అప్సరస లప్పుడు
చెమ్మ చెక్కల నాడుచుండిరి,
చెందిరిక పావడలు దాలిచి.

అచట పాలను అలకనందగ
అభ్రగంగా పుణ్య వాహిని,
కన్ను లెత్తిన చల్లబరచుచు
వెన్నెలలు కురిపించుచుండును!

పరుగు పరుగున నారదుం డా
ప్రాంతమున కరుదెంచుచుండెను;
మహతిసుందరి వీణ బరువై
మోయలేకను రొప్పుచుండెను.

అచటి గంధర్వాప్సరో జను
లా మునీశ్వరు రాక చూచిరి,
ఆటలను చాలించి వారలు
అతని వెంబడి పరుగులెత్తిరి.

"ఏల స్వామీ! ఇంత తొందర?
ఏమి మునిగెను చెప్పు" మనగా,
పులుకు పులుకున వారలను గని
పలుకడాయెను ఆ మహాముని.

నారదునితో పరుగులెత్తుచు
వారలెల్లరు రజత పర్వత
గుహల సన్నిధి దాటి, శంభుడు
కూరుచుండిన చోటి కేగిరి.

హర హర హర మహాదేవ!
అను నాదము మిన్ను ముట్ట
చాపకట్టుగా అందఱు
సాగిలపడి మ్రొక్కినారు.

ఉత్పల సత్యనారాయణాచార్య





వెల్లువలో మునిగి లేచు
పల్లులవలె వారందఱు
కన్నీరొత్తుచు లేచిరి,
కైమోడ్చుచు నిలుచుండిరి.

ఏమి జరిగెనంచు శివుడు
ఆ మునికి నడిగినాడు;
ఎట్టకేల కతడు లేచి
ఇట్లు చెప్పదొడగినాడు.

"శివ శివ శివ! ఏమందును?
చెప్పుటకును నోరాడదు—
దక్షయజ్ఞమున నెంతో
దారుణమయ్యెను, దేవా!

ఏమి యెఱుగనట్లు నీవు
ఇచ్చటనె కూర్చుంటివి;
దాక్షాయణి అచటికేగి
దగ్ధ మయ్యె, పరమశివా!"

అనినంతట పరమశివుని
కనులు జేవురించినయవి;
మెడయందలి పెను పాములు
పడగలెత్తి నిల్చినయవి!

పీఠముపై లేచి శివుడు
పెంచినాడు తన దేహము;
కైలాసం బతని ముందు
గవ్వవలె కాన్పించెను.

"నారద! భయపడకుండగ
నా కెఱిగింపుము పూర్తిగ;
సతి యెట్టులు దగ్ధ మయ్యె?
సైనికు లేమై పోయిరి?"

అని యడిగిన పరమేశుని
కాతడిట్లు చెప్పినాడు:
"దక్షుడు మిము దూషించెను,
తనయను అవమానించెను.

ఆ కోపముతోడ నామె
అగ్ని దగ్ధురా లైనది;
హా హా ధ్వనితో యజ్ఞము
అంతట గగ్గోలైనది.



ప్రమథు లప్పుడు దక్షునిపై
పరిమార్చగ దూకినారు;
భృగుమహర్షి సైన్యములకు
బెగడొందుచు పోయినారు."

ఆ మాటలు విని రుద్రుడు
ఆగ్రహమున 'హుం'మ్మనియెను;
గుహలన్నియు ఒక్కసారి
గొల్లుమంచు నినదించెను!

గజ్జెలు ఘలు ఘల్లు మనగ
కాలుకదిపి భూతేశుడు
ఢమరకమును మ్రోయించెను,
ప్రమథుల నట రావించెను.

భూతము లాడుచు పాడుచు
భూమి యీనినట్లు వచ్చె!
నందీశ్వర, పుష్పదంత,
నాగేశ్వరు లరుదెంచిరి.

పెను జడ లటునిటు ముసరగ
పెల్లున తలయెత్తి శివుడు
చిచ్చుకంటిలో నిప్పులు
చెలరేగగ జేసినాడు.

శివుని మెడను చుట్టుకొన్న
చిలువలు జఱ జఱ్ఱున దిగి
బుస్సని తల బాదుకొనెను
భూమిపైన ముమ్మారులు!



భీకరముగ శివుడు నవ్వి,
పెను జడ నొకదాని పెఱికి
నేలమీద కొట్టినాడు—
నిట్ట నిలిచి చూచినాడు.

ఆ జడ దెబ్బకు నచ్చట
అవతరించె నొక వీరుడు,
వేఱొక రుద్రుండేయన
వీరభద్రు డను శూరుడు!

కారుమేఘము వలె నాతడు
గగన మంటుచు నిలిచె నప్పుడు;
మెఱపుతీగల వోలె నాతని
నెఱులు ధగధగ లాడుచుండెను.

వేయి చేతుల నాయుధమ్ములు;
వెడద రొమ్మున పుఱ్ఱెదండలు,
గల్లు గల్లని మ్రోయ రుద్రుని
గాంచి మ్రొక్కెను వీరభద్రుడు.

"దేవా! ఇక నానతిమ్ము,
సేవకు డిదె వచ్చినాడు,"
అనిన వీరభద్రుని గని
అభవు డిట్లు పలికినాడు.

"నా వర్గమునకెల్ల నాయకుడవై నీవు
దక్షయజ్ఞమ్మెల్ల ధ్వంసంబు గావించు!
నా యంశతో పుట్టినాడ వాటను నీకు
లోకమున లొంగనిది లేకుండు నికపొమ్ము!"

అని పలుకుచు తన త్రిశూల
మతనికిచ్చె భూతేశుడు;
విభునిచుట్టు తిరిగి మ్రొక్కి
వెడలె వీరభద్రు డప్పుడు.

భూనభములు మాఱుమ్రోయ
భూతేశుడు శంఖమూదె;
వీరభద్రు సైన్య మెల్ల
వెల్లువయి సాగిపోయె.

—(సశేషం)





4

[కేశవుడు వింత జంతువు నెక్కి కొండ మీదికి పారిపోయాడు. అక్కడ ఒక గుహలో మాంత్రికుడొకడు కేశవుడికి కాలభైరవుడి విగ్రహాన్ని చూపించి, దాని కన్నుల్లో అడవిలో జరుగుతున్న కోలాహలాన్ని కేశవుడు చూసేలా చేశాడు. మనిషితలా, గబ్బిలం రెక్కలూ వున్న ఒక ఆకారం రాజభటులను తరుముతున్నట్టు కేశవుడికి కనిపించింది. తరవాత—]

రాజభటులను హడలెత్తించి, వాళ్ళు అడవిలో చెల్లా చెదురుగా పారిపోయేట్టు చేస్తున్న వికటాకారాన్ని చూసి కేశవుడు పొందిన ఆశ్చర్యం అంతా యింతా కాదు. గబ్బిలానికున్నట్టు రెక్కలున్న మనిషి వుంటాడనిగాని, లేక గబ్బిలానికి మనిషి తల లాంటిది వుంటుందనిగాని, వాడు ఏనాడూ వినివుండ లేదు. కాని, యిప్పుడు స్వయంగా అలాటి వింత ఆకారం వున్నట్టు చూశాడు. ఇది వాస్తవమా లేక మాంత్రికుడు తన మంత్రశక్తి చేత తనకు కలిగిస్తున్న భ్రమా?

"వత్సా, కేశవా! చూశావా, కాలభైరవుడి శక్తి సామర్థ్యాలు? ఇక నీ తండ్రికి యిప్పట్లో రానున్న ప్రమాదం ఏమీలేదు. రాజభటులు తిరిగి చూడకుండా బ్రహ్మపురం పారి పోతారు. నాయనా, నీ ముసలి తండ్రిని కాపాడే భారం నాదని లోగడే నీకు అభయం యిచ్చానుగదా! ఏదీ నీ భుజం మీద వున్న అంబులపొదిని పక్కకు తొలగించు.





సంశయ నివారణ చేసుకోవాలి,'' అన్నాడు మాంత్రికుడు.

ఆ సరికి కేశవుడికి మాంత్రికుడి మీద ఎంతో కృతజ్ఞతాభావం కలిగింది. రాజభటుల పాలపడకుండా తన తండ్రిని అతడు కాపాడాడని కేశవుడు నమ్మాడు. ఆ కారణంవల్ల మాంత్రికుడు అడగటమే తడవుగా అతడు భుజంమీది నుంచి అంబుల పొదిని పక్కకు లాగాడు. మాంత్రికుడు కేశవుడి భుజాన్ని కొద్దిసేపు కన్నార్పకుండా చూసి, ''ఆహాహా! వత్సా, అదృష్టవంతుడివి. నీది అమోఘమైన జాతకం. నీ దెబ్బకు తిరుగులేదు. మూపుమీద మహారాజ యోగాన్ని సూచిస్తూ, ఈ లోకంలోకి వచ్చావు!'' అంటూ కేశవుడి వీపు చరిచి, ''అయినా, ఆవగింజంత సంశయం మాత్రం ఎందుకుండాలి? ఇప్పుడే తేల్చుకుందాం,'' అంటూ గుహ నుంచి బయటికి వెళ్ళాడు.

మాంత్రికుడికి అంత ఆనందాన్ని కలిగించిన విశేషం ఏమిటో చూసేందుకు కేశవుడు తన భుజాన్ని ముందుకు వంచి పరీక్షించాడు. అక్కడ ఏవిధమైన పుట్టుమచ్చలుగాని, ఇతర గుర్తులుగాని అతడికి కనిపించలేదు. తన కళ్ళకు కనిపించని గుర్తులేవో మాంత్రికుడికి కనిపించి వుండవచ్చని కేశవుడు అనుకుంటున్నంతలో, మాంత్రికుడు ఏవో ఆకులను అరచేతిలో నలుపుతూ అక్కడికి వచ్చి, ''వత్సా, ఆ పుట్టుమచ్చ నీ కంటికి కనబడేదికాదు. ఇదిగో, ఈ ఆకు పసరు రాయనీ, నువ్వు కూడా దాన్ని చూడవచ్చు,'' అంటూ పసరును కేశవుడి భుజానికి రాశాడు.

పసరు తగలగానే కేశవుడి భుజంమీద పడగవిప్పిన నల్లనిపాము ఆకారం ఒకటి కనిపించింది. దాన్ని చూస్తూనే మాంత్రికుడు బ్రహ్మానందం పొంది, ''వత్సా, కేశవా! ఇక మనకు వశ్యంకాని శక్తి అంటూ ఏదిలేదు. కాలభైరవుడు, ఆది భైరవుడు, ఉన్మత్త





భైరవుడు... అందరూ మన యింటి పాలేళ్ళు కాబోతున్నారు," అని పెద్దగా మంత్రం జపిస్తూ కాలభైరవుడి విగ్రహం ముందు సాష్టాంగపడి, చూస్తూండగానే ఉపాసనా తన్మయత్వంలో కళ్ళు మూశాడు.

కేశవుడు మాంత్రికుడు కళ్ళు తెరుస్తాడేమో అని చూస్తూ అక్కడే నిలబడ్డాడు. కాని, పావుగంట కాలం గడిచినా అతడిలో చలనం కనిపించలేదు. కేశవుడికి ఎందుకనో హఠాత్తుగా భయం కలిగింది. ఒకవేళ మాంత్రికుడు తనను కాలభైరవుడికి బలి చెయ్యటానికి తెచ్చాడేమో అనుకున్నాడు. ఈ అనుమానం కలగ్గానే కేశవుడు అప్రయత్నంగా తన ఆయుధాలకోసం చూశాడు. కత్తి, విల్లంబులూ గుహ వాకిలి దగ్గిర అతడికి కనిపించినై. కేశవుడు ఒక్క దూకున అక్కడికి వెళ్ళి, వాటిని తీసుకునేందుకు వంగాడు. అంతలో, "ఆగు, కేశవా, తొందరపడకు!" అన్న హెచ్చరిక అతడికి వినిపించింది. కేశవుడు తల ఎత్తి ముందుకు చూశాడు. ఎదురుగా దాదాపు ఇరవైఏళ్ళ వయసుగల యువకుడొకడు నిలబడి వున్నాడు.

"నువ్వెవరివి? ఇక్కడికెలా వచ్చావు?" అన్నాడు కేశవుడు ఆశ్చర్యంగా.



"నేను బ్రహ్మదండి మాంత్రికుడి శిష్యుణ్ణి. నేను ఎక్కడినుంచి రాలేదు, ఇక్కడే వుంటాను," అన్నాడు యువకుడు.

"ఎవరు బ్రహ్మదండి మాంత్రికుడు?" అని అడిగాడు కేశవుడు.

"ఓయి అమాయకుడా, ఆ మాత్రం అర్థం కాలేదా?" అంటూ యువకుడు కాలభైరవుడి విగ్రహం ముందు సొమ్మసిల్లి పడివున్న మాంత్రికుణ్ణి చూపించాడు.

"హఠాత్తుగా ఆకాశం నుంచి ఊడి పడ్డట్టు నువ్వు కనబడటంతో నేను కాస్త భయపడ్డాను, సుమా!" అన్నాడు కేశవుడు కత్తినీ, విల్లంబులనూ తీసుకుంటూ.



"ఆ కొత్త పయిపట్టుంగూడా మరిచి పోవాలి. లేకపోతే నువ్వు రానున్న ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోగలవ్?" అన్నాడు యువకుడు.

"ఏమిటి రానున్న ప్రమాదం?" అని అడిగాడు కేశవుడు ఆశ్చర్యంగా. అతడికి వింతజంతువు తనకు కనపడిన నిముషం నుంచి, తను చిక్కుల్లో పడ్డానన్న సంగతి గుర్తు కొచ్చింది. దానికోసం చుట్టూ కలయ చూశాడు. కాని, అది ఆ చాయల ఎక్కడా వున్నట్టులేదు.

"దేనికోసం చూస్తున్నావ్?" అని అడిగాడు యువకుడు.



"ఒక వింతరకం జంతువు వెంట నేనిక్కడికి వచ్చాను. అదేమయిందా అని చూస్తున్నాను." అన్నాడు కేశవుడు.

యువకుడు పెద్దగా నవ్వి, "ఆ వింత జంతువును, నేనే! నేను బ్రహ్మదండి మాంత్రికుడి శిష్యుణ్ణి అని చెప్పానుగదా. నా పేరు జయమల్లు. నా వల్లనే నువ్వు ఇన్ని ప్రమాదాలకు లోను కావలసివచ్చింది గనక, నిన్ను నా శక్తికొద్దీ కాపాడేందుకు ప్రయత్నిస్తాను." అన్నాడు జయమల్లు.

జయమల్లు మాటలు వింటూనే కేశవుడు, గురు శిష్యుల మధ్య ఏదో విరోధభావం వున్నదని గ్రహించాడు. అతడు గుహ లోపలికి చూశాడు. బ్రహ్మదండి మాంత్రికుడు కాలభైరవుడి విగ్రహం ముందు రాయిలా కదలా మెదలక పడివున్నాడు.

"అతడు మనం ఏం మాట్లాడుకున్నా విని స్థితిలోలేడు. అతణ్ణి భక్తిమైకం కమ్మింది. మనం [illegible]. సూర్యోదయమయ్యేవరకూ అలాగే వుండి పోతాడు." అన్నాడు జయమల్లు.

"అలాగా? నాకేది ప్రమాదం రానున్న దన్నావు, ఎవరి నుంచి?" అని అడిగాడు కేశవుడు. జయమల్లు బ్రహ్మదండి మాంత్రికుడికేసి వేలుచూపాడు.



"అయితే, నేను యిప్పుడే కొండ దిగి పారిపోతాను. నన్ను ఆపగల వాళ్లెవరు?" అన్నాడు కేశవుడు.

జయమల్లు చిరునవ్వు నవ్వుతూ, కేశవుణ్ణి భుజం పట్టుకుని గుహ ముందు నుంచి దూరంగా తీసుకుపోయి, "ఒకసారి ఈ బ్రహ్మదండిగాడి చేతిలో పడినవాడు తప్పించుకుని పోలేడు. నా సంగతేమను కుంటున్నావ్? మనం వాణ్ణి హతం చేసి తప్ప యిక్కణ్ణుంచి ప్రాణాలతో పారి పోలేం," అన్నాడు.

"అయితే, ఆ పని యిప్పుడే చేస్తాను. వాడు మైకంలో వుండగానే కత్తితో తల నరుకుతాను," అంటూ కేశవుడు కత్తి పైకెత్తి గుహకేసి వెళ్ళబోయాడు.

జయమల్లు కేశవుడి భుజం పట్టుకుని ఆపుతూ, "తొందరపడకు కేశవా. మన యిద్దరం ఏకమయితే, వాణ్ణి ఏనాడైనా చంప వచ్చు. ఇప్పుడు నువ్వు వాణ్ణి చంపి పొంద గలిగే లాభం ఏముంది? నువ్వు కొండ దిగి అడవిలోకి పోగానే రాజభటులు నిన్ను శత్రుదేశపు గూఢచారివని పట్టుకుంటారు. తెలిసిందా?" అన్నాడు.

"రాజభటుల్ని మనిషితలా, గబ్బిలంలా రెక్కలూ వున్న ఒక భయంకరాకారం అడవిలో నుంచి తరిమేసిందిగదా?" అన్నాడు కేశవుడు.



ఈ మాటలకు జయమల్లు బిగ్గరగా నవ్వాడు. తరవాత కేశవుణ్ణి వెంట పెట్టుకుని ఒక ఎత్తయిన ప్రదేశానికి తీసుకుపోయి, దిగువగా వున్న అడవికేసి చేయిచూపుతూ, "జాగర్తగా చూడు! ఎంతమంది రాజభటులు నీ కోసం అడవిలో చెట్లూ పుట్టలూ గాలిస్తున్నారో!" అన్నాడు.

కేశవుడికి అంతా విచిత్రంగా వున్నది. జయమల్లు చెప్పినదాంట్లో అబద్ధం ఏమీ లేదు. గుర్రాలమీద కొందరూ, కాలి నడకన కొందరూ, రాజభటులు అడవిలో చెట్లూ





చేమా, పుట్టలూ పొదలూ వెతికి చూస్తున్నారు. "అయితే, ఇందాక మాంత్రికుడు నాకు కాలభైరవుడి కళ్ళల్లో కనబడేలా చేసిందంతా వట్టి మాయ అన్నమాట!" అన్నాడు కేశవుడు.

"కాక మరేమిటనుకున్నావ్? నన్ను ఇంత మృగంగా మార్చి నీ దగ్గిరకు పంపినవాడే. నిన్ను చిక్కుల్లో పడేలా చేసి, ఈ కొండ మీదికి రప్పించుకున్నాడు. అందుకు నేను సహాయపడక తప్పలేదు. నీ కుడి భుజంమీద వున్న పుట్టుమచ్చ— పడగవిప్పిన సర్పం—అతన్ని ఆనందంతో ఒళ్ళు మరిచేలా చేసింది. నీ ద్వారా మాత్రమే వాడు కోరుతున్న అపూర్వ శక్తుల్ని వశపరుచుకోగలడు. అందుకు నిన్ను ఉపయోగించుకోబోతున్నాడు. తెలిసిందా?" అన్నాడు జయమల్లు.

"ఏమిటా అపూర్వశక్తులు? వాటి కోసం నా కెలాంటి పరీక్ష పెట్టబోతున్నాడు?" అని అడిగాడు కేశవుడు.

జయమల్లు చిరునవ్వు నవ్వి, కేశవుడి కేసి చూస్తూ కొంచెంసేపు ఊరుకుని, తరవాత అతడి రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుని, "కేశవా, ఈనాటి నుంచి మనం స్నేహితులం. ఏది కాని మన స్నేహాన్ని భగ్నం చెయ్యలేదు. నువ్వూ, నేనూ కూడా ఈ బ్రహ్మదండి మాంత్రికుడి వల్ల ప్రమాదానికి లోను కాబోతున్నాం. కాని, ఇద్దరం ఏకమై కలిసి కట్టుగా వుంటే, వాడు మన నేమీ చెయ్యలేడు. అంతేకాక, వాడు సంపాయించాలని ప్రయత్నిస్తున్న అమానుష శక్తుల్ని మనమే సంపాయించవచ్చు. నిన్ను వాడే విధంగా వుపయోగించుకోవాలని చూస్తున్నాడన్న విషయం..."

జయమల్లు మాట పూర్తి చేయకుండానే కొండలో ఉరుములాంటి పెద్ద ధ్వని పుట్టి, ఫెళఫెళ మంటూ భయంకరంగా మోగి, కొండ అటూ ఇటూ—నీటిలో పడవ వూగి







నట్టు ఊగసాగింది. పెద్దపెద్ద కొండరాళ్ళు పల్లానికి జారసాగినై. కేశవుడూ, జయమల్లూ తాము నిలుచున్న చోటు పక్కనుంచి దూరంగా పరిగెత్తారు. అంతలో గుహ లోపలి నుంచి బ్రహ్మదండి మాంత్రికుడు కేకలు పెడుతూ బయటికి వచ్చి, అడవి కేసి చూస్తూ, "ఆహాహా! కాలభైరవుడి అమోఘశక్తి, నా మంత్ర ప్రభావం! కొండ కుదుపు దగ్గర నుంచి కదిలిపోతున్నది. కావాలంటే దీన్ని ఆకాశంలో పక్షిలా ఎగి రించగలను! అదుగో, చూడండి! కొండ ఎక్కాలని చూసిన రాజభటులు వివిధంగా ప్రాణాలు అరిచేత పట్టుకుని పారి పోతున్నారే! నేను మంత్రించి వదిలిన కొండరాళ్ళు వాళ్ళను వెంటబడి తరుము తున్నై," అన్నాడు.

కేశవుడూ, జయమల్లూ కొంత దిగువకు చూశారు. మాంత్రికుడు చెప్పినట్టే రాజ భటులు అశ్వాలమీదా, కాలి నడకనా కొండ దిగి పరిగెత్తుతున్నారు. భూకంపం వల్ల అదురుతున్నట్టు ఊగిసలాడుతున్న కొండ మీంచి పెద్దపెద్ద రాళ్ళు దొర్లి పల్లంలో వున్న అడవిలోకి వెళ్ళి పడుతున్నవి. వాటి తాకిడికి గుర్రా లెక్కివున్న కొందరు రాజ భటులూ, కొందరు కాలిబంట్లూ అడ కత్తెరలో చిక్కిన పక్కల్లా నలిగి పోతున్నారు. బ్రహ్మదండి మాంత్రికుడు కేశవుడికేసి పరీక్షగా చూస్తూ తృప్తిగా తలా డించ సాగాడు.

కేశవుడు కొద్దికాలం నిశ్చేష్టుడై, ఆ భయంకర దృశ్యాన్ని చూసి తేరు కుంటున్నంతలో, బ్రహ్మదండి మాంత్రికుడు అట్టహాసం చేస్తూ, "శిష్యా, మన కేశవుణ్ణి మచ్చలసింహం గుహ ముందున్న విషగుల కొలనులో స్నానం చేయించి తీసుకురా! సూర్యాస్తమయం తరవాత మనందరం చేయవలసిన ముఖ్యమైన పనులు చాలా వున్నవి," అన్నాడు. —(ఇంకావుంది)



గాడిద బుద్ధి

క్వీచౌలో గాడిదలుండేవికావు. ఒకసారి ఒక పనిలేని వాడొక గాడిదను పడవలో తెచ్చి అక్కడ కొండలలో వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. ఆ ప్రాంతంలో ఉంటున్న పులి ఒకటి ఈ కొత్త జంతువును చూసి, "అమ్మయ్యో, ఎంత జంతువో!" అని మొదట హడలి పోయింది. కాని దన్నిగురించి తెలుసుకోవాలని కోరిక కలిగి కొంచెం దగ్గిరగా వచ్చింది.

ఇంతలో గాడిద ఓండ్రపెట్టింది. "చచ్చాన్రా, బాబోయ్!" అని పులి గుండెలవిసి దూరంగా పారిపోయింది. అయితే గాడిద తనను తరిమి మీదపడి చంపకపోవటం చూసేసరికి పులి భయం కాస్త తగ్గింది. గాడిద అరుపు ఎంత భయంకరంగా ఉన్నా అది ప్రమాదమైనది కాదని పులికి తెలిసిపోయింది.

ఇప్పుడు పులి భయంతీరి గాడిదను సమీపించింది. దానితో పరాచకాలు ప్రారంభించింది. పులి తనను రాచుకోవటమూ, తోయటమూ మొదలైన వేషాలు చేస్తూండటం చూసి గాడిదకు కోపం వచ్చి తన వెనక కాళ్ళతో తన్నింది.

"ఓస్ ఇంతేనా నువు చేయగలిగింది. ఇంకా ఏమో అనుకున్నాను," అంటూ పులి గాడిద మీదపడి చంపి తినేసి తనదారిన తాను వెళ్ళిపోయింది. తాను చెయ్యగలిగినదంతా పులికి తెలియనివ్వటం వల్లనే గాడిద ప్రమాదం తెచ్చుకున్నది.





తప్పిపోయిన ప్రమాదాలు

విసుగు చెందని విక్రమార్కుడు తిరిగి చెట్టు వద్దకు వెళ్ళి, చెట్టుపై నుంచి శవాన్ని దించి భుజాన వేసుకుని, ఎప్పటిలాగే మౌనంగా శ్మశానం కేసి నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు, "రాజా, నీవు చాలా దుర్ఘటమైన పనినే తలపెట్టావు. కాని నీకు ఒక్క విషయం తట్టి ఉండదు. అదేమిటంటే, ఒక్కొక్కసారి అతి చిన్న పనులు చెయ్యటమే అసంభవంగా పరిణమిస్తుంది. నా మాటలో నీకు నమ్మకం లేకపోతే ఒక చిన్న కథ చెబుతాను. అది వింటూ నీ శ్రమ కాస్త మరిచిపో," అని ఈ విధంగా చెప్పసాగాడు:

ఒకప్పుడు ఒకానొక దేశాన్ని ఒకానొక రాజు ఏలుతూండేవాడు. ఆ రాజు అకస్మికంగా మరణించాడు. రాజు కొక కొడుకున్నాడు, కాని వాడు నెలల పిల్లవాడు. అప్పుడప్పుడే బోర్లపడి కేరింతాలుకొడుతున్న ఆ చంటి పిల్లవాడు, తండ్రి పోవటంతో,

బేతాళ కథలు





దేశానికి రాజయాడు. ఇందుకు రాజ్యంలోని ప్రజలందరూ సంతోషించారు.

చచ్చిపోయిన రాజుగారి కొక తమ్ముడు ఉన్నాడు. అన్నగారు అకస్మికంగా పోవటంతో వాడికి రాజ్యలోభం పట్టుకున్నది. అన్న కొడుకైన ఆ నలుసంత కుర్రవాడు తనకూ సింహాసనానికి మధ్య అడ్డంగా ఉండటంవల్ల ఆ చంటివాణ్ణి ఏదోవిధంగా చంపేసి తనే రాజై పోవాలని నిశ్చయించుకున్నాడు, రాజు తమ్ముడు.

అర్భకుడూ, అసహాయుడూ అయిన ఆ పసిగుడ్డును చంపటం అతడికి చాలా సులువుగా తోచింది.

రాజ శిశువును హత్యచెయ్యటానికి పరదేశి అయిన యోధుడొకడు రాజు తమ్ముడికి దొరికాడు. అతను ఆ యోధుణ్ణి రాజసౌధంలో ఒకచోట దాచాడు. తరవాత శిశువు ఉండే గది గుర్తుపెట్టుకుని, అక్కడ శిశువును చూసుకుంటున్న దాదికీ, భటులకూ చేతిలో డబ్బుపెట్టి ఏవో పనులమీద పంపి, యోధుడి దగ్గిరికి వచ్చి, "ఇప్పుడు నీవు ఫలాని గదికి వెళితే నీకు రాజు ఒంటరిగా దొరుకుతాడు. అతణ్ణి హత్య చేసిరా! ఇదుగో నీ బహుమానం," అంటూ చేతిలో పుష్కలంగా బంగారం పెట్టాడు.

యోధుడు కత్తితీసుకుని, రాజు తమ్ముడు చెప్పిన గదికి వెళ్ళాడు. అక్కడ అతనికి రాజుగారు కనిపించలేదుగాని, తివాసీపైన కూచుని ఒక పండుతో ఆడుకుంటున్న శిశువు కనిపించాడు. ఆ శిశువే రాజని ఆ పరదేశియోధు డెరగడు.

సరిగా యోధుడు గదిలోకి వచ్చే సమయానికే పండు శిశువు చేతులనుంచి దూరంగా దొర్లిపోయింది. శిశువు పండుకేసి చెయ్యిచాచి, యోధుడికేసి చూసి, "వో, వో!" అన్నాడు. యోధుడా పండును శిశువుకేసి దొర్లించాడు. శిశువు చప్పట్లు చరుస్తూ యోధుణ్ణి చూసి నవ్వాడు.





యోధుడు తాను వచ్చిన పనిమాట మరిచి పోయి ఆ శిశువుతో సరదాగా ఆడుకుంటుండగా భటులు తిరిగి వచ్చి రాజుతో ఆడుకునే యోధుణ్ణి పట్టుకున్నారు.

"నేను రాజుగారితో పనుండి వచ్చాను. ఆయన కనిపించలేదు. ఈ బిడ్డ ఒంటరిగా యిక్కడ వుండటం చూచి, ఆడుకుంటున్నాను," అన్నాడు యోధుడు.

"రాజుగారు పోయి ఏనాడాయె? ఇప్పుడీ బిడ్డే రాజుగారు. ఈ సంగతికూడా నీకు తెలియదా?" అన్నారు భటులు.

యోధుడు నిర్ఘాంతపోయి, "అలాగా? అయితే ఈ సంగతి మా ప్రభువుగారితో చెబుతాను," అన్నాడు. అతను మంచి వాడులాగే కనబడటంచేత రాజభటులు అతన్ని వెళ్ళిపోనిచ్చారు. ఆ యోధుడు కూడా రాజు తమ్ముణ్ణి చూడటానికి మొహం చెల్లక ఆ క్షణమే ఆ దేశాన్ని విడిచిపెట్టి మరొకదేశానికి వెళ్ళిపోయాడు.

తన పథకం పారకపోయేసరికి రాజు తమ్ముడు మరొక ఎత్తువేశాడు. ఈసారి అతను కొందరు దొంగలను పిలిచి, "ఫలాని రోజున కొంతమంది మనుషులు ఊరికి దూరంగా ఉండే ఆలయానికి వెళతారు. ఆ రోజు మీరు దారిలో కాచి ఉండి ఆ వచ్చే వారి పైనబడి దోచుకోండి. ముఖ్యంగా ఆ మనుషుల వెంట ఒక పసి పిల్లవాడుంటాడు. వాడి ఒంటిమీద వెలలేని నగలుంటాయి. వాటన్నిటినీ దోచుకున్నారంటే మీ దరిద్రం తీరిపోతుంది. మిగిలినవాళ్లను చంపుతారో మానుతారో మీ యిష్టం, కాని ఈ పసివాణ్ణి మాత్రం ప్రాణాలతో వదలవద్దు," అని చెప్పాడు.

ఈ ఏర్పాటు ప్రకారం దొంగలందరూ రాజు తమ్ముడు చెప్పినరోజున ఊరి బయట దేవాలయం దగ్గర కలుసుకుని నింపాదిగా, చెట్లచాటుగా రాచ నగరుకేసి కదిలి రాసాగారు.

ఈలోపుగానే మరొక దొంగల ముఠా వాళ్ళు, రాజ శిశువును దేవాలయానికి తీసుకుపోయే పరివారాన్ని చూసి, వారిపైన పడి అందరి తలకాయలూ పగలగొట్టి, దొరికినదంతా దోచుకున్నారు. వాళ్ళు రాజ శిశువునుకూడా దోచుకున్నారు, కాని ఆ పసివాడు ఎవరితోనూ ఏమీ చెప్పలేదు గనక, చంపక దారిలో విడిచి తమ దారిన వెళ్ళిపోయారు.

రాజ శిశువు వెంట వచ్చిన పరివారంలో ఒక్క దాసీది మాత్రమే ప్రాణాలతో తప్పించుకుని పారిపోయింది. దొంగలు వెళ్ళిపోయాక ఆమె దాక్కున్నచోటి నుంచి తిరిగి వచ్చి, రాజ శిశువు మార్గంలో ప్రాణాలతో పడివుండటం చూసి, అతన్ని ఎత్తుకుని ఇంటికి తిరిగి వచ్చింది. ఈ విధంగా ఆ శిశువుకు మరొక గండం గడిచింది.

తన ప్రయత్నాలు రెండు విఫలమయే సరికి రాజు తమ్ముడు మూడోసారి వంటవాడికి బాగా లంచంపెట్టి రాజ శిశువు పాలలో కలపమని గరళం ఇచ్చాడు. ధనాపేక్షచేత నీచుడైన ఆ వంటవాడు ఒక లోటాలో పాలుపోసి, అందులో గరళం కలిపి తెచ్చి శిశువు చేతికిచ్చాడు. శిశువు లోటా ఎత్తి నోటితో అందుకోబోయే క్షణంలో దాదులలో ఎవతో కటిక్కున తుమ్మింది.



ఆ చప్పుడుకు అదురుకుని శిశువు లోటాను జారవిడిచాడు. గరళంతో సహా పాలన్నీ నేలపాలైపోయాయి.

రాజు తమ్ముడు చేసిన మూడో ప్రయత్నం కూడా ఫలించలేదు. అతను ఇంకేమేమి ప్రయత్నాలు చేసేవాడోగాని ఈ లోపలనే అతనికి గల శత్రువులలో ఎవరో అతన్ని హత్య చెయ్యటం జరిగింది. అందుచేత రాజుశిశువు నిరపాయంగా పెరిగి పెద్దవాడై పట్టాభిషేకం చేసుకుని చాలాకాలం సుఖంగా రాజ్యంచేశాడు.

బేతాళుడీ కథ చెప్పి, "రాజా, నాకు ఒక్కటే సందేహం. రాజు శిశువు పసిగుడ్డు, అల్పప్రాణి, అతని ప్రాణానికి ఎంతైనా చాలు. రాజు తమ్ముడు పాపభీతి లేనివాడు, హత్యచేయటానికి తీర్మానించుకున్నవాడు, రాజ్యకాంక్షతో తహతహలాడిపోతున్నవాడు. అటువంటివాడు ఆ అల్ప ప్రాణిని చంపలేకపోవటం ఏమిటి? అతను మూడుసార్లు గట్టి ప్రయత్నాలు చేస్తే మూడూ విఫలం కావటమేమిటి? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసికూడా చెప్పకపోయావో నీ తల పగిలిపోతుంది," అన్నాడు.

దానికి విక్రమార్కుడు, "ఆ శిశువు అల్పత్వమే అతడికి అంగరక్ష అయింది. మనం ఎంతో భద్రంగా దాచే రత్నాలనే దొంగిలిస్తారు, పనికిమాలిన రాళ్లను ఎవరూ ఎత్తుకుపోరు. రథ చక్రం కింద పడిన పెద్ద రాయి పిండి పిండి అవుతుంది, ఇసుక నలుసు చెక్కుచెదరదు. భయంకరమైన తుఫానుగాలి పెద్ద మానులను పడదోస్తుందిగాని, నేల నంటుకుని వుండే గరిక పోచలను ఏమీ చెయ్యలేదు. అల్పప్రాణి, అర్భకుడూ కావటంవల్లనే రాజ శిశువుకు అపాయం తప్పింది," అన్నాడు.

రాజుకు ఈ విధంగా మౌనభంగం కలగగానే బేతాళుడు శవంతో సహా మాయమై మళ్లీ చెట్టెక్కాడు. (కల్పితం)





ఖలీఫా కనువిప్పు

2

అబుల్ కాసిం ఇచ్చిన బహుమతులను తీసుకుని తన దారిన తాను బాగ్దాదుకు వెళ్ళిపోవటం ఖలీఫాకు కొంచెంకూడా మనస్కరించలేదు. ఆయనను అనేక సందేహాలు బాధించాయి. ఎవరీ యువకుడు? ఇంత వెలలేని కానుకలను అభ్యాగతుల కివ్వడానికి సంకోచించడే, ఇతడికి గల సంపద ఎలాటిది? ఎంత సంపద అయినప్పటికీ ఇలాటివాడి చేతిలో అది ఏనాడో హారతి కర్పూరంలాగా హరించిపోయి ఉండాలే! అలా ఎందుకు జరగలేదు?

ఈ కాసిం వెనక ఏదో గొప్ప రహస్యం ఉన్నది. ఆ రహస్యాన్ని తెలుసుకు తీరాలని ఖలీఫాకు అనిపించింది. అతిథి మర్యాదకు భంగం కలిగినా సరే ఆ రహస్యం తెలుసుకోకుండా బాగ్దాదుకు తిరిగి పోరాదని ఖలీఫా నిశ్చయించుకున్నాడు. ఆయన తనకు కాసిం పంపిన కానుకలన్నీ వెంటబెట్టుకుని అబుల్ కాసిం ఇంటికి బయలుదేరి వెళ్ళాడు.

ఆయన కాసింతో, "అయ్యా, తాము పంపిన కానుకలు అమూల్యమైనవి. అందుచేత నా కవి తీసుకోవటానికి మనస్కరించటంలేదు. వాటిని తిరిగి పుచ్చుకోండి. తమ ఈవి నిజంగా అగణ్యమైనది," అన్నాడు.

ఈ మాటలకు కాసిం నొచ్చుకుని, "బాబూ, నా ఆతిథ్యంలో ఏదో లోపం జరిగి ఉండాలి. లేదా నా కానుకలు మీకు హీనమైనవిగా తోచి ఉండాలి. లేకపోతే నన్నిలా అవమానించటానికి తమరు స్వతం నుంచి పనిపెట్టుకుని రారు!" అన్నాడు.

"అయ్యయ్యో! అలా ఒక్కనాటికి అనుకోవద్దు. ఆతిథ్యం ఇచ్చినవారిని

జి. నాగేంద్రశర్మ



అవమానించే దుర్మార్గుణ్ణి కాను. నా విచార మల్లా ఇంత విలవైన వస్తువులను మీకు లేకుండా ఎలా చెయ్యనా అనే! ఎంతటి సంపదైనా ఇలా పందారం చేస్తుంటే తరిగి పోతుంది చూడండి!" అన్నాడు ఖలీఫా.

కాసిం ఆందోళనపడటం మాని, "తమరు నా ఇంటిని మళ్ళీ పావనం చెయ్యటానికి కారణం అలాటి అపోహే అయిన పక్షంలో మీరా సంకోచాన్ని విడిచిపుచ్చవచ్చు. అభ్యాగతులుగా నా యింటికి వచ్చినవారి కందరికీ ఇలాటి కానుకలు ఇచ్చి ఉన్నాను. అల్లా కటాక్షం వల్ల నాకు గల సంపద తరగటమంటూ ఉండదు. నా కథ యావత్తూ విన్నట్టయితే ఆ సంగతి మీకే తెలుస్తుంది," అంటూ తన కథ యావత్తూ దాచకుండా ఖలీఫాకు ఇలా చెప్పాడు.

కైరోనగరంలో అబ్దుల్ అజీజ్ అనే ప్రసిద్ధ నగల వర్తకుడొకడుండేవాడు. అనేక తరాలుగా ఆయన వంశంవారు కైరోలో నివసిస్తున్నప్పటికీ, అబ్దుల్ అజీజ్ సంపద మీద కైరో సుల్తాను కన్నుపడటం వల్ల ఆయన కైరో నుంచి పారిపోయి బస్రాలో మకాం పెట్టాడు. అక్కడ ఆయన ఒక వర్తకశ్రేష్ఠుడి కుమార్తెను పెళ్ళాడాడు. వారికి అబూ అల్ కాసిం అని ఒక్కడే కుమారుడు కలిగాడు.

కాసిం చిన్నవాడుగా ఉండగానే తలిదండ్రులు పోయారు. అతను పెద్ద ఆస్తికి ఏకైక వారసుడై, అజ్ఞానంచేత ఒళ్ళు తెలియకుండా డబ్బంతా తగలేసి, రెండేళ్ళకల్లా బికారి అయిపోయాడు. పూలు అమ్మిన చోట కట్టెలు అమ్మిన విధంగా బాగాబతికిన చోట దారిద్ర్యం అనుభవించలేక కాసిం బస్రా వదిలిపెట్టి, దేశాటన చేస్తూ, కాలక్రమాన తన పూర్వీకుల నివాస స్థలమైన కైరో చేరుకున్నాడు. తన తండ్రి ఎంతో వైభవంతో జీవించిన ఆ కైరోనగరంలో తాను బికారిగా బతకవలిసి వచ్చినందుకు

అతనికి దుఃఖం కలిగింది. ఈ విచారంతో మునిగిపోయి కాసిం నైల్‌నది తీరం వెంబడి సుల్తానుగారి భవనాల వెనుకగా నడుస్తూండగా అతనికి పై అంతస్తు కిటికీ వద్ద చంద్రబింబంలాటి ముఖం కనిపించి అంతలోనే మాయమయింది.

ఆమెను చూసిన క్షణంలోనే కాసిం తన కష్టాలన్నీ మరిచిపోయి, ఆమె మళ్లీ దర్శనమిస్తుందన్న ఆశతో చీకటిపడినదాకా అక్కడే తారట్లాడి, చివరకు నిరాశ చేసుకుని, తాను దిగిన సత్రానికి వెళ్లిపోయాడు. మర్నాడు అతను అక్కడికే వెళ్లి అదే కిటికీ కేసి ఆశతో చూశాడు, కాని ఆ ముఖం అతనికి కనిపించలేదు. అయినా కిటికీకి అడ్డంగా వేసి ఉన్న తెర కొంచెంగా కదిలినట్టూ, దాని గుండా తనను ఎవరో చూసినట్టూ అతనికి తోచింది.

కాసిం దీక్షగా మూడోనాడు కూడా అక్కడికి వెళ్లి ఆ కిటికీనే చూస్తూ నిలబడ్డాడు. ఆరోజు సాయంకాలంవేళ ఆ యువతి తెరను తొలగించి తన అందమైన ముఖాన్ని కాసింకు కనబరిచింది. కాసిం ఆమె అపూర్వ సౌందర్యానికి సాగిలబడి లేచి, "ఓ సుందరీ! నా అదృష్టం ఎలాటిదోగాని ఈ నగరానికి వచ్చిన ఘడియలోనే నాకు నీ దివ్యదర్శనం లభించింది.





ఈ అదృష్టం సొంతం నాకు దక్కుతుందో లేదో తెలియదు," అన్నాడు.

ఈ మాటలు విని ఆమె బెదిరిపోయినట్టు కనపడింది. కాసింకుకూడా పారిపోవాలని పించింది. కాని సాహసించి అతను అక్కడే నిలబడ్డాడు. అతని సాహసం ఫలించింది. ఆమె కిటికీలో నుంచి బయటికి వంగి, రహస్యంగా, "అర్ధరాత్రికి రా. ఇప్పుడు వెళ్ళిపో!" అన్నది. తరవాత ఆమె ముఖం అదృశ్యమయింది.

కాసింతనకన్న అదృష్టశాలి ప్రపంచంలో ఉండడనుకుంటూ, పెదవాళ్ల స్నానశాలకు వెళ్ళి, చక్కగా స్నానం చేసి, తన దుస్తులు



ఘుమఘుమ లాడేలాగు చేసుకుని, అర్ధరాత్రివేళకు రాజభవనపు కిటికీ వద్దకు వచ్చాడు. కిటికీలోనుంచి తాటినిచ్చెన ఒకటి బయటికి వేళ్ళాడుతున్నది. జంకు లేకుండా కాసిం ఆ నిచ్చెన ఎక్కి ఒక చీకటి గదిలో చేరాడు. అది దాటి, మరొక చీకటి గది కూడా దాటినాక ఒక గదిలో దీపం వెలుగుతున్నది. ఆ గదిలో అతని సుందరి కనిపించింది.

ఇద్దరూ ఆప్తస్నేహితులలాగా మాట్లాడుకున్నారు. కాసిం తన కథ అంతా చెప్పినాక ఆమె, "నా పేరు లతీఫా. నన్ను సుల్తాను పెళ్ళాడాడు. కాని నాకు సుఖం లేదు. అందరికీ నేనంటే తగని అసూయ. అందరూ నన్ను నిర్మూలించే అవకాశం కోసం చూస్తున్నారు," అని చెప్పింది.

వారిలా మాట్లాడుతూండగానే వారున్న గది తలుపు ఎవరో దబదబా తట్టారు.

"కొంప మునిగింది! సుల్తాను తప్ప మరెవరూ నా గది తలుపు తట్టరు. మనని ఎవరో పట్టిచ్చారు!" అన్నది లతీఫా.

అలాగే జరిగింది. సుల్తాను అంతఃపురంలో ఉండే కొజ్జాలు ఇరవైమంది గదిలోకి వచ్చి, కాసింను పట్టుకుని ఎత్తి తీసుకుపోయి, ఒక కిటికీ గుండా నైల్‌నది





లోకి విసిరివేశారు. మరొక కిటికీ నుంచి లబీబానుకూడా నదిలోకి విసరటం అతనికి కనిపించింది.

అదృష్టవశాత్తూ కాసింకు ఈత వచ్చును. అతను తనను ప్రేమించిన అభాగ్యురాలి శరీరం కోసం ఎంతోసేపు వెతికాడు, ఎన్నో సార్లు నీటి అడుగుకు వెళ్ళాడు. కాని ఆమె దొరకనే లేదు. ఆ రాత్రే అతను కైరో నగరాన్ని విడిచిపెట్టి కొంతకాలానికి బాగ్దాదు నగరం చేరుకున్నాడు.

కాసిం బాగ్దాదు చేరేసరికి అతని వద్ద ఒక్క దీనారం మాత్రమే మిగిలిఉన్నది. దానితో అతను మిఠాయీ, పళ్ళూ, సుగంధ లేపనాలూ కొని వాటిని వీధులవెంట అమ్ముతూ, అమ్మేవాళ్ళలాగా కేకలు వెయ్యటానికి బదులు, పాటలుకట్టి పాడుతూ తిరగసాగాడు. అతని కంఠం శ్రావ్యంగా ఉండటంచేత అమ్మకం జోరుగాసాగింది.

ఒకనాడు కాసిం వీధివెంట పాడుతూ తన సరుకులు అమ్ముతూ పోతూంటే, నగరంలోకెల్లా పెద్ద దుకాణం గల ఒక వృద్ధుడు అతన్ని పిలిచి ఒక పండు కొని, తన సరసన కూచోమని, అతని ఊరూ పేరూ అడిగాడు.

"బాబూ, గాయాన్ని ఎందుకు కెలుకుతావు?" అన్నాడు కాసిం దీనంగా.

వృద్ధుడు ఆ విషయం వదిలేసి అతని అమ్మకాలను గురించి ఏవో ప్రశ్నలు వేసి, పది బంగారు దీనారాలు చేతిలో పెట్టి కాసింను పంపేశాడు.

మర్నాడు కాసిం అటుగా వచ్చినప్పుడు ఆ వృద్ధుడు అతని వద్ద ఏదో కొని, దగ్గర కూర్చోబెట్టుకుని మళ్ళీ అతని ఊరూ పేరూ అడిగాడు. ఆయన అంతగా అడుగుతూంటే కాసింకు చెప్పక తప్పింది కాదు.

కాసిం చెప్పిన కథ అంతా విని, "నాయనా, నీకు అబ్దుల్ అజీజ్ అన్న ధనికుడు తండ్రి కాబోతున్నాడు. అల్లా

సాక్షిగా నేను నిన్ను పెంచుకుంటాను. నాకా పిల్లలు లేరు. ఇక కలగబోరు. నీవు చాలా బుద్ధి శాలివిగా ఉన్నావు. నీ కష్టాలు ఇక గట్టెక్కాయనుకో," అన్నాడు వృద్ధుడు.

ఆయన కాసిం చేతిలో ఉన్న తట్టను అవతల పారేయించి, దుకాణం మూసేసి, కాసింతో సహా తన ఇంటికి వెళ్ళాడు.

"రేపు మనం ఈ నగరం వదిలి, బస్రాకు బయలుదేరి వెళ్ళి అక్కడే సుఖంగా జీవింతాం. నా స్వస్థలంకూడా అదే," అని ఆయన కాసింతో చెప్పాడు.



వారిద్దరూ బస్రాలో ఒక సంవత్సరం సుఖంగా గడిపినాక వృద్ధుడు మంచాన పడ్డాడు. ఆయన వ్యాధి నయం కాదని వైద్యులు చెప్పారు. అప్పుడాయన కాసింను తన చెంతకు పిలిచి, "నాయనా, ఏడాది పాటు నీ మూలంగా నాకు పుత్రవాత్సల్యం తీరింది. ఇందుకుగాను నేను నీకు తరగని సంపదను అప్పగించి పోతాను. అంత సంపద ప్రపంచంలో ఏ రాజులవద్దా, చక్ర వర్తులవద్దా ఉండదు. ఈ సంపద మా వంశంలో అనాదిగా ఉన్నది. దీని రహస్యం మా తాత నుంచి మా తండ్రి, ఆయన నుంచి నేనూ తెలుసుకున్నాం; నేను నీకు చెబుతాను," అంటూ తరగని నిధి ఉన్న స్థలం వివరాలు కాసింకు చెప్పేసి ఇంకా ఇలా అన్నాడు: "సంకోచం లేకుండా ఈవి చెయ్యి. ఎంతమందికి ఎంతేసి ఇచ్చినా నీ సంపద తరగబోదు. సమస్త సౌఖ్యాలూ నిస్సంకోచంగా అనుభవించు. అల్లా నిన్ను కాపాడతాడు!"

ఈ మాటలంటూ వృద్ధుడు కన్ను మూశాడు. కాసిం తన పెంపుడు తండ్రికి ఉత్తర క్రియలుచేసి తనకు సంక్రమించిన తరగని సంపదను తనివిదీర అనుభవించ సాగాడు. అతన్ని పూర్వం ఎరిగినవాళ్ళు, అతను ఒకటి రెండేళ్ళలో మళ్ళీ బికారి అయిపోతాడనుకున్నారు. కాని ఈసారి అలా



జరగలేదు. పై పెచ్చు అతని ఖర్చు రోజు రోజుకూ హెచ్చి పోయింది. బస్రాకు వచ్చిన ప్రతి పరదేశికీ గొప్పగా ఆతిథ్యం ఇచ్చి రాజోపచారాలు చేస్తున్నాడు కాసిం.

కాసిం వద్ద ముల్లె చేరిందని నగరంలోని అధికార్లకు తెలిసింది. వారందరూ లౌక్యంగా లంచాలకోసం చేతులు చాచారు. ఎవరెంత అడిగితే అంత మొత్తం దిన భత్యంగా కాసిం ఏర్పాటు చేశాడు. అందు వల్ల అతని కేలోటూ రాలేదు, వాళ్ళబెడద మాత్రం తప్పింది...

అంతా విన్నాక ఖలీఫాకు కాసిం నిధి చూడాలని గాఢమైన వాంఛ కలిగింది. ఆయన కాసింతో, "అయ్యా, మీరు ఈరీతిగా వ్యయం చేస్తున్నప్పటికీ మీ నిధి తరగటం లేదంటే నాకు నమ్మ శక్యంకాకుండా ఉన్నది. నా కళ్ళతో చూస్తే గాని నమ్మను. మీరు నా కోరిక తీర్చినట్టయితే ఆ నిధి రహస్యం ఎక్కడా వెల్లడించనని ప్రమాణం చేస్తాను," అన్నాడు.

"మీ కోరికను న్యాయంగా నేను నిరాకరించవలసిందే. కాని నా అతిథి అసంతృప్తితో వెళ్లటం నాకు ఏమాత్రమూ ఇష్టం లేదు. అందుచేత మీరు కళ్ళకు గంతలు కట్టుకుని నా వెంట రావటానికి సమ్మతించినట్టయితే నా నిధిని చూపిస్తాను," అన్నాడు కాసిం. ఖలీఫా అందుకు సంతోషంగా సమ్మతించాడు. కాసిం ఆయన కళ్లకు గంతలు కట్టి వెంట తీసుకుపోయాడు. వారిద్దరూ చాలా ఇరుకైన మార్గాలవెంట చాలా దూరం నడిచారు, చాలా మలుపులు తిరిగారు, చాలా మెట్లు దిగి అథఃపాతాళానికి చేరారు. చివరకు కాసిం గంతలు తీసేసరికి ఖలీఫా కళ్ళు జిగేలుమన్నాయి. వారొక విశాలమైన హాలులో ఉన్నారు. దాని గోడలకూ, కప్పుకూ అంతులేని సూర్యకాంత మణులు తాపడం చేసి ఉన్నాయి. హాలు మధ్యను చలువ రాతితో కట్టిన గొయ్యి, నూరడుగుల వ్యాసం

గలది, ఉన్నది. దాని నిండా బంగారు మొహర్లున్నాయి. గొయ్యి అంచున, బంగారు దిమ్మలమీద రత్నాలు మలిచి చేసిన పన్నెండు విగ్రహాలున్నాయి.

కాసిం ఖలీఫాను ఆ గోతి వద్దకు తీసుకుపోయి, "దీనికి అడుగంటూ లేదు. మా పూర్వీకులందరూ విచ్చలవిడిగా ఖర్చు చేసినప్పటికీ ఈ గోతిలోని బంగారం అర అంగుళం మాత్రమే తరిగింది," అన్నాడు. తరవాత అతను ఖలీఫాను మరొక పెద్ద హాలులోకి తీసుకుపోయాడు. అందులో ఇంకా వెడల్పయిన గొయ్యి ఉన్నది. దాని నిండా సానపట్టిన వజ్రాలూ, ముడి వజ్రాలూ ఉన్నాయి. ఈ గోతిచుట్టూ నెమలిగల చెట్లు—ఖలీఫాకు కానుకగా ఇచ్చిన చెట్టు లాటివి, అసంఖ్యాకంగా ఉన్నాయి.

ఇలాటి హాళ్ళు ఎన్నో తిప్పి, చివరకు ఖలీఫాకు మళ్ళీ గంతలు కట్టి కాసిం తన ఇంటికి తీసుకువచ్చాడు. ఖలీఫా అతనితో, "అయ్యా, మీరు చాలా సుఖపడుతూ ఉండి ఉండాలి. మీ వద్ద అందగత్తెలైన స్త్రీలు అన్ని దేశాలకు చెందిన వారూ ఉన్నారనుకుంటాను," అన్నాడు.

కాసిం నిట్టూర్చి, "నాకు స్త్రీ జనానికేమీ కొదవ లేదు. కాని నైల్‌నదిలో మునిగి పోయిన నా ప్రేయసికి వీరందరూ సమం



గారు. ఆమె కోసం నా సంపద యావత్తూ త్యాగం చెయ్యగలను," అన్నాడు.

"అలాటి బాధలను చేతిలో ఉన్న సుఖాలతో మాపేసుకోవాలి," అని ఖలీఫా సలహా ఇచ్చాడు. కాని లోలోపల కాసిం యొక్క హృదయాన్ని ఎంతో మెచ్చుకున్నాడు. ఆయన కాసిం వద్ద సెలవు పుచ్చుకుని, బాగ్దాదుకు తిరిగివస్తూనే జాఫర్ను సన్మానించాడు.

ఆయన జాఫర్‌తో జరిగినదంతా చెప్పి, "మనం ఈ యువకుడికి ఏ విధమైన ప్రత్యుపకారం చెయ్యగలమో నాకు తెలియటం లేదు," అన్నాడు.

"అతన్ని బస్రాకు రాజుగా నియమించండి," అన్నాడు జాఫర్.

"నీవే స్వయంగా వెళ్ళి నా ఫర్మానా అందవేసి, అతన్ని ఇక్కడికే తీసుకురా. అతని పట్టాభిషేకం నేనే స్వయంగా చేస్తాను," అన్నాడు ఖలీఫా.

జాఫర్ కాసింను తెచ్చాడు. ఖలీఫా అతనికి ఎదురు వెళ్ళి ఆలింగనం చేసుకుని, కన్న కొడుకుపై చూపదగినంత ప్రేమ చూపాడు. తరవాత ఆయన కాసింను స్వయంగా స్నానశాలకు తీసుకువెళ్ళాడు. అతిథిని ఇలా ఆదరించటం ఖలీఫా జీవితంలో ఇదే మొదటిసారి.

వారిద్దరూ నలుగులు పెట్టుకుని స్నానాలు చేసే సమయంలో పాడటానికి ఒక కొత్తగా వచ్చిన బానిసపిల్ల వచ్చింది. ఆమెను చూస్తూనే కాసిం కేక పెట్టి మూర్ఛపోయాడు. ఎందుకంటె ఆమె లతీఫాయే! ఆమెను నైల్ నది నుంచి ఒక పల్లెవాడు కాపాడి బానిసగా విక్రయించాడు. ఆమెను కొన్నవాడు ఆమెను ఇటీవలనే ఖలీఫా భవనానికి విక్రయించాడు. ఈ విధంగా కాసిం తన ప్రియురాలిని కలుసుకున్నాడు. ఆమె తిరిగి రాని అయింది. ఆమెను పెళ్ళాడి కాసిం బస్రా రాజుగా చాలాకాలం సుఖంగా జీవించాడు.





పళ్ళబుట్ట గొడవ

బొమ్మ ఒకనాడు గ్రామాధికారి ఇంటికి వెళ్ళి ఆయనతో తన మనమడి విషయం మొరపెట్టుకున్నది. "మా వాడు బొత్తిగా ఎందుకూ పనికిరాకుండా ఉన్నాడు. వాడికి ఒక్క పని చేతకాదు. ఏం చెయ్యాలో తోచటంలేదు," అన్నదావిడ.

"నీ కెందుకు, వాణ్ణి మా ఇంట కొద్ది రోజులుంచు. వాడికి అన్ని పనులూ చక్కగా నేర్పుతాను," అన్నాడు గ్రామాధికారి. సరే. ఇంకేం, భీమన్న గ్రామాధికారి ఇంటికి వచ్చి పనిచెయ్యటం ప్రారంభించాడు. ఆదేం ప్రారబ్ధమో వాడు చెప్పిన పని చెప్పినట్టు చేసికూడా చివాట్లు తినేవాడు. దీనికి కారణం వాడి అశ్రద్ధ కాదు; వాడికి సొంతంగా ఆలోచించేటందుకు బుర్రలేదు. అలాగే వాడు గ్రామాధికారి ఏ ఊరుపోతే ఆ ఊరల్లా తానుకూడా పోతూ కొన్నాళ్ళు పనిచేశాడు.

ఒకనాడు గ్రామాధికారి భీమున్ని పిలిచి, "ఏటి అవతల మొన్న మనం వెళ్ళివచ్చామే ఆ గ్రామానికి వెళ్ళి అక్కడ ఉండే మన కాపు సుబ్బయ్యకు ఈ ఉత్తరం ఇచ్చిరా," అని చెప్పాడు.

భీమన్న ఆ జాబు తీసుకుని ఆ గ్రామానికి ప్రయాణం చేసి కాపు సుబ్బయ్యకు దాన్ని ఇచ్చి ఇంటికి తిరుగు ప్రయాణమైనాడు. ఆ సమయంలో కాపు భీమన్నకు ఒక పళ్ళబుట్ట యిచ్చి, "ఇందులో యాభై అరటి పళ్ళున్నాయి. అవి త్వరలోనే పండుతాయి. పండినప్పుడవి ఎర్రగా అవుతాయి. ఎర్రగా అయిన తరవాత వాటిని నిలవ ఉంచటం మంచిదికాదు. వెంటనే తినాలి," అని చెప్పాడు.

భీమన్న పళ్ళబుట్ట తీసుకుని బయలుదేరాడు. వాడు నది దగ్గిరికి వచ్చేసరికి ప్రవాహం జాస్తిగా ఉన్నది. ఆ రోజు నది

దాటటం సాధ్యపడలేదు. మర్నాడు భీమన్న నది దాటి బుట్టలో పళ్ళకేసి చూసుకున్నాడు. అవి ఎర్రగా ఉన్నాయి. పళ్ళు ఎర్రబడ్డాక నిలవ ఉంచరాదనీ, వెంటనే తినాలనీ కాపు చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చి భీమన్న కష్టపడి యాభై అరటి పళ్ళూ తినేసి, ఖాళీబుట్ట తీసుకుని ప్రయాణం పూర్తిచేసి గ్రామాధికారి ఇల్లు చేరుకున్నాడు.

"వెళ్ళిన పని అయిందా? చీటీ సుబ్బయ్యకు ఇచ్చావా?" అని గ్రామాధికారి అడిగాడు.

"ఇచ్చాను. ఇదుగో బుట్ట. సుబ్బయ్య మీ కివ్వమన్నాడు," అంటూ భీమన్న ఖాళీ బుట్ట గ్రామాధికారి ఎదట పెట్టాడు.

"ఈ ఖాళీబుట్ట దేనికిచ్చాడూ?" అని గ్రామాధికారి ఆశ్చర్యంతో అడిగాడు.

"ఖాళీబుట్ట ఇవ్వలేదు. అందులో యాభై అరటిపళ్ళు పెట్టి, వాటిని ఎర్రబడగానే తినాలనీ, నిలవుంటె చెడిపోతాయనీ చెప్పాడు. నేను ఏరుదాటి చూస్తే పళ్ళు ఎర్రబడ్డాయి. నిలవుంటే చెడిపోతాయని అన్నీ తిన్నాను," అన్నాడు భీమన్న.

గ్రామాధికారికి మండిపోయింది. ఆయన భీమన్నను నానా చివాట్లూ పెట్టి, "నీ మొహం నాకు చూపించకు, వెళ్ళిపో," అని ఇంటికి పంపేశాడు.


బామ్మ వాణ్ణి చూస్తూనే ఏదో జరిగిందని గ్రహించింది. జరిగినదంతా విన్నాక ఆవిడ నిరాశతో, "ఓరి వెధవా! నీ కింక ఈ జన్మలో బుద్ధిరాదు," అన్నది.


"మరి ఏ జన్మలో బుద్ధి వస్తుంది?" అని భీమన్న అడిగాడు.

"ఇంకొక జన్మ ఎత్తాలి," అన్నది బామ్మ.

"ఇంకొక జన్మ ఎప్పుడు ఎత్తుతాను?" అన్నాడు భీమన్న.

"చచ్చినాకనే ఇంకో జన్మ! నువ్వు పని చెయ్యటం చాల్లే. ఇల్లు కదలకు!" అన్నది బామ్మ. [పై సంచికలో మరొక సంఘటన]





పిల్లిపాలెం యువరాణి

ఒక నిర్జనారణ్యంలో ఒక కట్టెలు కొట్టుకునేవా డుండేవాడు. అతనూ, అతని భార్యా, కొడుకూ, కూతురూ అడవి అంచున గుడిసె వేసుకుని అందులోనే జీవిస్తూ ఉండేవారు. వారికొక పాడి ఆవూ, పెంపుడు పిల్లీ ఉండేవి.

కట్టెలు కొట్టేవాడికీ, అతడి పెళ్ళానికీ ఒక్క క్షణంకూడా పడేదికాదు. ప్రతి స్వల్ప విషయానికీ వాళ్ళు కుక్కల్లాగా కాట్లాడుకునేవారు. ఒకనాటి సాయంత్రం వాళ్ళు మామూలు ప్రకారమే పోట్లాడుకున్నారు. "ఈ ఇంట్లో నేను ఒక్క క్షణం ఉండను," అని భార్య వడ్డన చేసే తెడ్డు పడేసి చీకట్లోపడి ఎటో వెళ్ళి పోయింది.

"ఎక్కడికి పోతావో చూస్తాను," అంటూ అన్నం తింటున్న భర్త ఎంగిలి చేత్తోనే లేచి తానుకూడా బయటికి వెళ్ళాడు.

తమ తల్లిదండ్రులు తిరిగి వస్తారేమో నని అన్నా, చెల్లెలూ అర్ధరాత్రిదాకా చూశారు. కాని ఆ వెళ్ళినవాళ్ళు మళ్ళీ తిరిగి రానేలేదు. మర్నాడు పొద్దున అన్న తన చెల్లెలితో, "ఇంక వాళ్ళు తిరిగిరారు. వచ్చినా నేని ఇంటో ఉండను. నా బతుకు నేను చూసుకుంటాను. ఉన్న ఆస్తి మనిద్దరమూ పంచుకుందాం," అన్నాడు.

"మనకున్న ఆస్తి ఏమిటి ? బూడిద ! ఆవూ, పిల్లీయే గద!" అన్నది చెల్లెలు.

"అవును. ఆవును నేను తీసుకుంటాను. పిల్లిని నువ్వు తీసుకో," అన్నాడు అన్న.

ఇది అన్యాయమని చెల్లెలు అందామను కుంటుండగా పిల్లి ఆమె కాళ్ళకేసి రుద్దు కున్నది ఆపేక్షగా. చెల్లెలు ఏమనుకుందో ఏమోగాని, పిల్లిని తన చేతుల్లోకి ఎత్తుకుని, "నీ యిష్టం," అన్నది అన్నతో.

చెల్లెలు తన మనస్సెక్కడ మార్చు కుంటుందో నన్నట్టుగా అన్న ఆవును తీసు కుని అప్పుడే రహదారి పట్టుకున్నాడు.

సి. మాదవరావు



చెల్లెలు అన్నకేసి చూస్తూ నిలబడి ఉండగా ఆమెకు గుడిసెలో నుంచి మాటలు వినిపించాయి:

"ఇక మనదారిన మనం పోదాం పద!"

చెల్లెలు నిర్ఘాంతపోయి వెనక్కు తిరిగి చూసే సరికి గుడిసెలో పిల్లికిమారుగా ఒక ఆడపిల్ల కనిపించింది.

"ఎవరు నువ్వు?" అన్నది చెల్లెలు.

"అక్కా, నేనే నీ పిల్లిని, గుర్తించలేదా?" అంటూ ఆ పిల్ల తన అసలు కథ చెల్లెలికి చెప్పేసింది.

ఆ పిల్ల ఒక మంత్రగాడి కూతురు. ఆ మంత్రగాడు అడవిలో ఎవరికి తెలియకుండా తన నివాసం ఏర్పాటు చేసుకుని, తన మంత్రశక్తిచేత తన అవసరాలన్నీ గడుపుకుంటూ కొంతకాలం బతికాడు. వాడు తన కూతురికి అయిదో ఏట కామరూప విద్య నేర్పాడు. దాని సహాయంతో ఆ పిల్ల తన ఇష్టంవచ్చిన జంతువు రూపం ధరించి ఆ చుట్టుపక్కల కొన్ని ఆమడల దూరంలో జరిగే ప్రతిసంగతీ తెలుసుకుంటూ ఉండేది. ఆమెకు మనుషుల వెంట ఉండటం సరదాగా ఉండేది. తండ్రి మనుషుల మొహం చూడకుండా కీకారణ్యం మధ్య ఉండేవాడు. అందుచేత ఆమె తండ్రి దగ్గిరికి సామాన్యంగా వెళ్ళేది కాదు. కొద్ది కాలంక్రితం ఆ మంత్రగాడు చనిపోయాడు. అప్పటినుంచీ ఆ పిల్ల మరింత స్వేచ్ఛగా తిరుగుతున్నది. కట్టెలు కొట్టేవాడి ఇంట పిల్లిగా ఉంటూకూడా ఆమె రూపం మార్చుకుని తిరుగుతూనే ఉన్నది.

అంతా విన్నాక కట్టెలు కొట్టేవాడి కూతురు, "అవు కోసం పోట్లాడకుండా నేను నిన్ను తీసుకోవటం మంచిదయింది. మనం ఎక్కడికి పోదామంటావు?" అన్నది.

"ఇక్కడ ఈ గుడిసె తప్ప ఇంకేమున్నది? నేను చెప్పినట్టు చేశావంటే నిన్ను రాణిని చేస్తాను. ఆ తరవాత నువ్వూ,

నేనూ ఎంతో సుఖంగా బతకవచ్చు," అన్నది మంత్రగాడి కూతురు.

ఆమె మళ్లీ పిల్లిగా మారిపోయి అడవి మధ్యగా దారి తీసింది. కట్టెలుకొట్టేవాడి కూతురు ఆమె వెనకే బయలుదేరింది. ఇద్దరూ ఇలా చాలాదూరం నడిచి అడవి దాటారు. అంత దూరాన వారికి ఒక కోట కానవచ్చింది.

అప్పుడు మంత్రగాడి కూతురు కట్టెలు కొట్టేవాడి కూతురుతో, "అక్కా, నువ్వు నీ బట్టలన్నీ విప్పేసి దట్టంగా ఉన్న ఈ పొదలలో కూచో. నేను ఆ కనిపించే కోటకు వెళ్లి, అక్కడి రాజుగారితో నీవొక రాజకుమార్తెవని, నిన్నూ, నీ పరివారాన్నీ బంధిపోటు దొంగలు దోచారనీ, నీ పరివారం చెల్లాచెదరై పారిపోయిందనీ చెబుతాను. వాళ్లు వచ్చి నిన్ను తీసుకుపోతారు. నీవు మాత్రం రాజకుమార్తెలాగే ప్రవర్తించు. మీది ఏ నగరమని వాళ్లు అడిగితే, పిల్లిపాలెమని చెప్పు," అన్నది.

"రాజకుమార్తెలు ఏంచేస్తారో నాకు తెలీదే! మోసం కనుక్కొని నన్ను వాళ్లు మెత్తగా తన్నుతారేమో," అన్నది కట్టెలు కొట్టేవాడి కూతురు భయంతో.

"ఏమీ ఫరవాలేదు. నీ దగ్గిర నేను ఏదో రూపంలో ఉండనే ఉంటాను. దారితప్పి





నువ్వు ఏదైనా చేసినప్పుడు ఎవరైనా అడ్డ వస్తే, మా పల్లెపాలెంలో ఇలాగే చేస్తాం, అని చెప్పు. నీకేమీ అపదరాదు," అన్నది మంత్రగాడి కూతురు.


తరవాత ఆమె ఏనుగుగామారి పొదలన్నీ కలియతొక్కింది. నేల అంతా మట్టగించింది. తన స్నేహితురాలి దుస్తులు చీలికలుచేసి అంతటా పడవేసింది. ఈ పనులన్నీ పూర్తిచేసి, కట్టెలుకొట్టేవాడి కుమార్తెను దట్టమైన పొదల మధ్య దాచి, తాను పక్షిగామారి కోటకేసి ఎగిరిపోయింది.

ఆ కోటలోపల ఉండే రాజుగారి వద్దకు భటులు మంత్రగాడి కూతురిని తీసుకువచ్చి, "మహారాజా, ఈ పిల్ల ఒక రాజకుమార్తె దాసిదట. మన కోటకు అంత దూరంలో తమ రాజకుమార్తె పరివారాన్ని బందిపోటు దొంగలు దోచారని చెబుతున్నది. రాజకుమార్తె దుస్తులుకూడా వాళ్లు కాజేశారట. ఆమె పాపం పొదలలో దాక్కొని ఉన్నదట. ఏమి సెలవు?" అని అడిగారు.

రాజుగారు ఆ భటులతో, "మీరు మంచి దుస్తులు కొన్నిపట్టుకుని, మన యువరాజును వెంటబెట్టుకుని ఈ పిల్ల చూపే చోటికి వెళ్లండి. ఈమె చెప్పిన మాటలలో నిజం ఉన్నట్టయితే ఆ రాజకుమార్తెను సగౌరవంగా తీసుకురండి. మన ప్రాంతంపు అడవులలో బందిపోటు దొంగలున్నారంటే అందుకు న్యాయంగా మనమే బాధ్యులమవుతాం," అన్నాడు.

రాజుగారి పెద్దకొడుకు రాజకుమార్తె కట్టదగిన చీరెలూ, దుస్తులూ తీసుకుని పరివారంతో సహా కోట వెడలివచ్చాడు. మంత్రగాడి కుమార్తె తొక్కేసి ఉన్న పొదలూ, నేలా చూపిస్తూ, "ఇక్కడే నండి మమ్మల్ని దొంగలు కొట్టింది," అన్నది.

"అబ్బా, రెండు పక్షాలకూ పెద్ద యుద్ధమే జరిగినట్టుందే!" అన్నాడు రాజకుమారుడు.



"అవును, మహారాజా! మా దొరసాని ఆ పొదల్లో ఉన్నది. బట్ట లిప్పించారంటే అవి తీసుకుపోయి ఇచ్చి, ఆమెను ఇవతలికి తెస్తాను," అన్నది మంత్రగాడి కూతురు.

తాను తెచ్చినబట్టలు కట్టుకుని కట్టెలు కొట్టేవాడి కూతురు పొదలలో నుంచి బయటకి రాగానే రాజకుమారుడు ఆమెను మోహించాడు. ఎందుకంటే అసలే కట్టెలు కొట్టేవాడి కూతురు కనుముక్కు తీరుగల మనిషి. రాణి వాసపు దుస్తులు ధరించే సరికి పదిరెట్లు అందంగా కనబడింది. తన తల్లిదండ్రులను ఒప్పించి ఆమెను పెళ్ళాడాలని కలలుగంటూ రాజకుమారుడు కట్టెలుకొట్టేవాడి కూతురును మేనాలో తమ అంతఃపురానికి తీసుకుపోయాడు.

రాణిగారుకూడా ఆమెను చూసి తప్పక రాజకుమార్తె అయి ఉంటుందనుకున్నది. ఆమె, "మీ ఊరేదమ్మా? ఎక్కడికి పోతున్నావు? ఏం జరిగింది? అంతా చెప్పు," అని అడిగే సరికి కట్టెలుకొట్టేవాడి కూతురు భయంతో వణికిపోతూ బావురుమన్నది.

పక్కనే ఉన్న మంత్రగాడి కూతురు, "మహారాణీ, మా అమ్మగారికి జరిగిన సంగతులు జ్ఞాపకం చెయ్యకండి. మాది పల్లిపాలెం. దానికి మా దొరసాని రాణి. ఆమెకు ఇప్పు డెవరూలేరు. కష్టాలలో ఆదుకున్నారు గనక మీరే ఆమెకిక బంధువులు," అని చెప్పింది.

కట్టెలుకొట్టేవాడి కూతురికి రాణి కొన్ని నగలుకూడా పెట్టి ఆదరించింది. ఆ నగలన్నీ పెట్టుకుంటే ఆ పిల్ల మరింత అందంగా కనబడింది. ఆమే, ఆమె దాసీనని చెప్పుకునే మంత్రగాడి కూతురూ ఉండటానికి ఒక గది ప్రత్యేకించారు. భోజనానికి తప్ప ఆమె ఆ గదిదాటి వచ్చేదికాదు. రాజకొడుకు మాత్రం ఏదో వంకపెట్టుకుని రోజుకు రెండు మూడుసార్లు ఆమె గదికి వెళ్ళి, పలకరించి వెళ్ళిపోతూండేవాడు.



కట్టెలుకొట్టేవాడి కూతురు అన్నివిధాలా తన స్నేహితురాలు చెప్పినట్టుగానే నడుచుకునేది. ఆమె చేసేపనులు రాణికి ఆశ్చర్యం కలిగించినప్పుడు ఆమె, "ఇది మా పిల్లిపాలెం ఆచారం," అంటూండేది.

ఆమె నిజంగా రాజకుమార్తె అవునో కాదో తెలుసుకోవటానికి రాజూ, రాణీ కలిసి కొన్ని పరీక్షలు పెట్టారు. ఎందుకంటే తమ పెద్ద కుమారుడు ఆ పిల్లను ప్రేమించి పెళ్ళాడ గోరుతున్నట్టు వాళ్ళకు తెలిసింది. అలాటప్పుడు ఆమె నిజంగా రాజకుమార్తె నని రూఢి చేసుకోకపోతే తరవాత ఏమనుకుని ఏం లాభం?




అయితే మంత్రగాడి కూతురు ఏ ఈగ రూపంలోనో, దోమరూపంలోనో అనుక్షణమూ వారి సమీపంలో తిరుగుతూ వారు పెట్టదలిచిన పరీక్షల వివరాలు తెలుసుకుని తన స్నేహితురాలితో చెప్పి, ఎలా మసులుకోవాలో తెలిపేది. అందుచేత కట్టెలుకొట్టేవాడి కూతురు ప్రతి పరీక్షలోనూ నెగ్గింది. తన హోదాకు తగిన ఆసనాలలోనే కూచున్నది, తన హోదాకు తక్కువైన పంటకాలు వడ్డిస్తే వాటిని ముట్టుకోలేదు. ఒకసారి రాణిగారు తమ అతిథి పడుకునే హంసతూలికాతల్పం అడుగున ఒక గడ్డిపోచ పెట్టించింది. మర్నాడు తెల్లవారగానే ఆమె కట్టెలుకొట్టేవాడి కూతుర్ని, "రాత్రి సుఖంగా నిద్రపోయావా, అమ్మా?" అని అడిగింది.

"ఎందు కడుగుతారు? పరుపు కింద ఏదో దుంగ ఉన్నంత బాధ కలిగింది. తెల్లవార్లూ ఆ కోటా, ఈ కోటా పడ్డాను. కారణం ఏమిటో తెలియదు," అన్నది కట్టెలుకొట్టేవాడి కూతురు.

ఇలా ప్రతి పరీక్షలోనూ నెగ్గేసరికి ఆమె మీద రాజుకూ, రాణికీ గురి కుదిరింది. తమ పెద్దకొడుకు పిల్లిపాలెం యువరాణిని చేసుకోవటానికి వారు సమ్మతించారు. పెళ్ళి





ముహూర్తంకూడా ఏర్పాటయింది. వివాహం కన్యయొక్క స్వగృహంలో జరగాలి గనక పెళ్ళికొడుకు తన పరివారంతో బయలు దేరటానికి నిశ్చయించారు.

వ్యవహారం ఇంతదాకా వచ్చేసరికి కర్రెలుకొట్టేవాడి కూతురికి భయంపట్టు కున్నది. పల్లిపాలెం ఎక్కడ ఉన్నది? అక్కడికి వెళ్ళేదారి ఎటు? ఆమె తన స్నేహితురాలైన మంత్రగాడి కుమార్తె మీద పడి, "నీ మూలకంగానే నేను చిక్కులో పడ్డాను. ఇక నిజం తెలిసి పోతుంది. నన్ను వీళ్ళు తల తీసేస్తారు!" అని కంట నీరు పెట్టుకున్నది.

"అక్కా, నీ కెందుకు లేనిపోని విచారం? అన్ని ఏర్పాట్లూ చెయ్యటానికి నేనున్నాను గద. ముహూర్తం ఇంకా వారం రోజు లున్నది. ఈ లోపల నేను వెళ్ళి నీకు ఒక కోటా, రాజ్యమూ అన్ని ఏర్పాటు చేసి వస్తాను," అని మంత్రగాడి కూతురు ఆ రాత్రికి రాత్రే పక్షిరూపంలో ప్రయాణమై, అక్కడికి అయిదామడ దూరాన, కొండల మధ్య ఉన్న ఒక కోటకు వెళ్ళింది.

చాలాకాలంగా ఆ కోటలో ఒక చీకటి రాకసి ఉంటున్నది. ఆ రాకసిలో ఉండే ప్రత్యేకమైన గుణం ఏమంటే అది సూర్య కాంతి కొంచెంకూడా భరించలేదు. కాని చీకటిలో దాని శక్తి అపారం. అది ఏను గులవంటి జంతువులనుకూడా రాత్రివేళ చంపగలదు. అందుచేత ఆ రాకసి చీకటి పడగానే కోట నుంచి బయటికివచ్చి, ఆ చుట్టుప్రక్కల దొరికిన జంతువులనూ, మనుషులనూ చంపితిని, తెల్లవారక మునుపే తన కోటకు తిరిగివచ్చి పగల్లా చీకటిగదిలో నిద్రపోతుంది.

మంత్రగాడి కూతురు మారురూపంలో ఎన్నోసార్లు ఈ కోటకు వచ్చింది, చీకటి రాకసిని చూసింది, దాని రహస్యం తెలుసు కుని ఉన్నది. అందుచేత ఆమె అర్ధరాత్రివేళ

రాకసి ఉండే కోటను చేరి లోపల ప్రవేశించి, కోట వాకిలి తలుపులకు రాకసిపెట్టే ఇనపగడియ పెట్టేసి రాకసిరాక కోసం ఎదురు చూడసాగింది.

తూర్పు తెల్లవారే సమయాన రాకసి వచ్చి తలుపులు నెట్టింది. కాని అవి తెరుచుకోలేదు. తాను రాత్రి వేటకుపోయి ఉన్న సమయంలో ఎవరోవచ్చి లోపల ప్రవేశించారని తెలుసుకొని రాకసికి చాలా కోపం వచ్చింది. తన కోటలోకి ప్రవేశించటానికి ఎవరికి గుండెలున్నాయి? "ఎవరు లోపల? తలుపు తియ్యి! లేకపోతే చంపేస్తా!" అని రాకసి పెడబొబ్బ పెట్టింది.

"నేనే నత్తా! చిట్టిగారెని!" అని మంత్రగాడి కూతురు లోపలి నుంచి తొణకకుండా జవాబు చెప్పింది.

ఆ జవాబు వినేసరికి రాకసికి మరింత మండి పోయింది.

"చిట్టిగారెకు నేనంటే అంత అలక్ష్యమా? తలుపు గడియ పెడతావా? వేగిరం గడియ తియ్యి!" అని రాకసి అరిచింది.

"ముందు నా కథ విను, అత్తా! తలుపు తీస్తానూ! నేనేమో మొదట పప్పును. నన్నేమో ముందు నానబెట్టారు. తరవాత ఎండ బెట్టారు. తరవాత దంచారు, తరవాత చెరిగారు—" అని మంత్రగాడి కూతురు



దీర్ఘాలు తీస్తూ చిట్టిగారె కథ ప్రారంభించింది. రాకసి కోపం పట్టలేక తలుపును గట్టిగా తన్నింది. కాని ఆ తలుపు ఆ రాకసి పెట్టినదే కావటంచేత కొంచెం కూడా కదల లేదు.

"నా కథ వినకుండా తలుపుతడితే నేను తీయనే తీయను! నేనేమో మొదట పప్పును. నన్నేమో ముందు నానబెట్టారు. తరవాత ఎండబెట్టారు, తరవాత దంచారు, తరవాత చెరిగారు, తరవాత తిరగట్లోపోసి విసిరి పిండిచేశారు. పిండిని తడిపి పెట్టారు. అందులో ఉప్పువేశారు—" అంటూ మంత్రగాడి కూతురు మళ్ళీ కథ ఎత్తుకున్నది.

రాకసి తూర్పుకేసి చూస్తే అప్పటికే భల్లున తెల్లవారి పోయింది. ఇంక సూర్యుడు వచ్చేస్తాడు. లోపల ఉన్న చిట్టిగారె తలుపు తియ్యకుండా ఇలాగే బయట ఉంచితే తనకు చావు తప్పదు. అందుచేత రికటి రాకసి పెడబొబ్బలతో లోపల ఉన్న మనిషిని భయపెట్టాలని చూసింది. తరవాత బతిమాలింది.

"నా బుల్లి చిట్టిగారే! గడియతియ్యి! నిన్నేమీ అనను! నీకు బోలెడంత బంగారం ఇస్తాను. మణులిస్తాను!" అన్నది రాకసి.

రాకసి తన కథకు అడ్డువచ్చినప్పుడల్లా మంత్రగాడి కూతురు, "నా కథ పాడు



చేశావత్తా! మళ్ళీ చెబుతా విను. మధ్యలో అడ్డురాకుండా నన్ను కథ చెప్పనిస్తే నే గడియ తీస్తానుగా!" అంటూ మళ్ళీ చిట్టి గారె కథ మొదలు పెట్టింది.

ఇంతలో సూర్యోదయం కానే అయింది. ఎండ మీదపడటం ఆరంభం కాగానే చీకటి రాకసి మంచుదిబ్బలాగా కరిగి పోసాగింది. త్వరలోనే దాని శరీరమంతా నిస్సార మయింది. స్పృహ తప్పిపోయింది. మూరెడు పొద్దెక్కేసరికి కోట ద్వారం వెలపల చీకటి రాకసి చర్మం తప్ప ఇంకేమీ మిగలలేదు.

మంత్రగాడి కూతురు పని సగం అయి పోయింది. ఆమె ఆ చుట్టుపట్ల ఉండే గ్రామాలకు వెళ్ళి అక్కడి జనంతో, "చీకటి రాకసి చచ్చి పోయింది. కోటలో ఇళ్ళన్నీ మీరు మళ్ళీ ఆక్రమించుకోవచ్చు. ఈ కోటకు పెళ్ళిపాలెం అని పేరుపెట్టారు. త్వరలోనే మన మహారాణిగారు వచ్చి ఇక్కడ పెళ్ళి సంబరం జరపబోతున్నారు," అని వివరంగా చెప్పింది.

తరవాత ఆమె వచ్చినట్టే, తన స్నేహితురాలి దగ్గిరికి తిరిగి వెళ్ళి, "అన్ని ఏర్పాట్లూ పూర్తి అయాయి. మనం వెళ్ళటమూ, నీ పెళ్ళి జరపటమూ తరువాయి. పెళ్ళిపాలెం పౌరులు పెళ్ళి ఏర్పాట్లన్నీ ఇప్పుడే ప్రారంభించారు," అని జరిగిన సంగతి అంతా ఆమెకు చెప్పింది.

తరవాత కట్టెలు కొట్టేవాడి కూతురూ, ఆమెను పెళ్ళాడే రాజకుమారుడూ సపరివారంగా తరలివచ్చారు. మంత్రగాడి కూతురు దారి చూపింది. రాకసి కోటలోకి జనం ప్రవేశించి, పెళ్ళి ప్రయత్నాలు కూడా చేసేశారు. అక్కడ కట్టెలు కొట్టేవాడి కూతురికీ, రాజకుమారుడికీ వైభవంగా పెళ్ళి అయింది. తరవాత రాజకుమారుడి తమ్ముడు మంత్రగాడి కూతుర్ని పెళ్ళి చేసుకున్నాడు. అంతా సుఖంగా ఉన్నారు.





మాటల దుకాణం

పూర్వం ఒక గ్రామంలో ఒక వింత దుకాణం ఉండేది. అది "మాటల దుకాణం." ధర్మపాలుడనే ఒకాయన ఆ దుకాణాన్ని నడిపేవాడు. ఆయన ఒక్కొక్క చీటీమీద ఒక్కొక్క సలహా రాసిపెట్టి, కావలసిన వారికి కావలసినన్ని సలహాలు అమ్మేవాడు. ఒక్కొక్క చీటీ ఖరీదు నూరు రూపాయలు. ఆ చీట్లు కొన్నవారు వాటిలోని సలహాలు పాటించి లాభం పొందుతూండేవారు.

ఒకనాడు ఆ దుకాణానికి ఒక శ్రేష్ఠి వచ్చాడు. ఆయన ధనికుడు. మాటల దుకాణంలో ఆయన మూడు వందలిచ్చి మూడు సలహాలు కొనుక్కున్నాడు. ఆ సలహా లేవంటే:

"ప్రయాణమై వెళ్ళేటప్పుడు భార్యకు వివరాలు చెప్పరాదు."

"దారిలో భోజనం చేయవలసివస్తే దారికి సమీపంగా భోజనం చెయ్యరాదు."

"తొందరపడి ఎవరితోనూ దేన్నిగురించీ పందెం వెయ్యరాదు."

ఈ సలహాలను కొనుక్కుని శ్రేష్ఠి ఇంటికి వెళ్ళాడు. వీటిలో యథార్థం ఎంత వరకు ఉన్నదీ తెలుసుకోవాలని ఆయనకు కుతూహలం కలిగింది. భార్యతో చెప్పకుండా ఆయన తొమ్మిది సంచులలో తొమ్మిది వేల రూపాయలు తీసుకుని, బండి మాట్లాడుకుని, వ్యాపారం చెయ్యటానికి బస్తీకి బయలు దేరాడు.

శ్రేష్ఠి కొంతదూరం ప్రయాణించాక భోజనం వేళ అయింది. దారికి కొంత దూరంలో బావి కనిపించిన చోట బండి ఆపి, బావి సమీపంలో భోజనంచేసి మళ్ళీ ప్రయాణమయాడు. కొద్దిదూరం వెళ్ళాక సంచులు లెక్క చూసుకుంటే, తొమ్మిది ఉండవలసినవి ఎనిమిదే ఉన్నవి. బావి వద్దకువెళ్ళివెతికితే పోయిన సంచి దొరికింది.

యస్. రాజగోపాలరావు



అది అక్కడే ఒక గడ్డి కుప్పకింద పడి ఉన్నది. తాను డబ్బిచ్చి కొనుక్కున్న సలహాలలో ఒకటి మేలుచేసింది. శ్రేష్ఠి సంతోషించాడు. తాను దారిలోనే భోజనం చేసినట్టయితే ఆ సంచిని దారేపొయ్యేవాళ్ళు ఎవరో ఒకరు తీసుకుని ఉండేవారే.

ఆ సంచి తీసుకుని ఆయన బండి వద్దకు వస్తుండగా ఆయన కాలికి ఒక పిచ్చి పుచ్చకాయ తగిలింది. చిత్రమేమంటే, అది తగలగానే ఆయన కాలికి ఎంతో కాలంగా మానకుండా ఉన్న పుండు ఒకటి తుడిచి పెట్టినట్టు నయమయింది. ఆ కాయలో ఏదో మహత్తు ఉండి ఉండాలనుకుని, దానిని తిరుగు ప్రయాణంలో తీసుకుపోయే ఉద్దేశంతో ఆయన బావి సమీపంలో గుర్తుగా ఒకచోట పాతిపెట్టి, బండిఎక్కి ప్రయాణం సాగించాడు.

బస్తీలో వ్యాపారం బాగా కలిసివచ్చింది. శ్రేష్ఠి పుష్కలంగా ధనం సంపాదించి, దారిలో తాను దాచిపెట్టిన పుచ్చకాయ మాట మరిచి, మరొక దారిన స్వగ్రామానికి తిరిగి వచ్చాడు.

ఆయన తిరిగి వచ్చేనాటికి ఆ గ్రామం లోని లక్షాధికారి రాచపుండుతో బాధ పడుతున్నాడు. ఆ రాచపుండు నయం చేసిన వారికి పదివేల రూపాయలిస్తానని ఆయన చాటింపు వేయించాడు. ఏమంటే, ఎంతో మంది దానికి తగిన చికిత్స చెయ్యలేక పోయారు. ఈ సంగతి వినగానే శ్రేష్ఠికి తాను దాచిన పిచ్చి పుచ్చకాయ జ్ఞాపకం వచ్చింది. అది తెస్తే లక్షాధికారి రాచపుండు నయమవుతుంది, తనకు పదివేలు లాభం వస్తుంది. ఈ సంతోషంలో ఆయన తాను కొనుక్కున్న సలహాలను మరిచిపోయి, తాను దాచిపెట్టిన పిచ్చి పుచ్చకాయ సంగతి, తాను దాన్ని తీసుకొచ్చి చికిత్సచేసి పదివేలు సంపాదించుకునేటందుకు అవకాశం ఉన్న సంగతి భార్యకు చెప్పేసి, "నేను ఇప్పుడే లక్షాధి

కారి వద్దకువెళ్ళి ఆయన చేత ఒప్పందం రాయించుకుని వస్తాను. రేపు బయలుదేరి వెళ్ళి ఆ కాయ తెచ్చుకోవచ్చు," అన్నాడు.

శ్రేష్ఠిగారి భార్య మరుక్షణమే ఈ విషయమంతా పూసగుచ్చినట్టు పొరిగింటి ఆవిడకు చెప్పింది. ఆవిడ తన భర్తకు చెప్పింది. శ్రేష్ఠి లక్షాధికారి ఇంటికి పోయేదారిలో పొరుగింటివాడు వచ్చి ఆయనను కలుసుకున్నాడు. మాటల సందర్భంలో ఇద్దరూ ఒకేపనిమీద వెళుతున్నట్టు స్పష్టమయింది.

"ఆ లక్షాధికారి రాచపుండు ఎలా నయమవుతుందో నాకు తప్ప ఇంకెవరికీ తెలియదు," అన్నాడు శ్రేష్ఠి.

"ఆ రహస్యం నాకూ తెలుసును," అన్నాడు పొరుగువాడు.

"లక్షాధికారి పుండు నయం చెయ్యటం నీ వల్ల కాదు," అన్నాడు శ్రేష్ఠి.

"నయం చేస్తాను. చాతనైతే పందెం కాయి!" అన్నాడు పొరుగువాడు. శ్రేష్ఠి తాను కొనుక్కున్న సలహాలు మళ్ళీ మరిచిపోయి, తన పొరుగువాడు ఆ రాచపుండు నయంచేసే పక్షంలో ఆయన తన ఇంట దేన్ని తాకితే దాన్ని ఇచ్చేస్తానని పందెంవేశాడు.

పొరుగువాడు ఆ సాయంకాలమే బయలుదేరి నూతి వద్దకు వెళ్ళి శ్రేష్ఠి దాచిపెట్టిన



పిచ్చి పుచ్చకాయను తప్పితీసి తెచ్చి, లక్షాధికారి రాచపుండుకు దాన్ని తగిలించి నయంచేసేశాడు.

శ్రేష్ఠి ఇంకా బయలుదేరక ముందే ఇంతా జరిగిపోయింది. అన్నప్రకారం తన పొరుగువాడు తన ఇంట్లోకి వచ్చి తన ఇనప పెట్టెతాకితే ఏం కాను? తన సంపద వేలకువేలు అందులో ఉన్నది. తాను సలహాలను పాటించక పోవటంచేతనే ఈ ప్రమాదం వచ్చి పడింది. తాను పుచ్చకాయ కోసం పోతున్నట్టు భార్యకు చెప్పాడు; అంతటితో పోనివ్వక తొందరపడి పొరుగువాడితో పందెం వేసుకున్నాడు.

శ్రేష్ఠి పరిగెత్తుకుంటూ మాటల దుకాణానికి వెళ్ళి ధర్మపాలుడి కాళ్ళమీదపడి, జరిగినంతా చెప్పి, తనకు నష్టం కలగకుండా ఉపాయం చెప్పమన్నాడు.

"జరిగిందేదో జరిగింది. నీ ఇనపపెట్టెను అటకమీద పెట్టించి, పొరుగువాడు వచ్చే సరికి అటకకు నిచ్చెనవేసి ఉంచు. నేను కూడా వస్తాను," అన్నాడు ధర్మపాలుడు.

పొరుగువాడు శ్రేష్ఠి ఇంటికి వచ్చి తన పందెం వసూలు చేసుకుంటాడని తెలిసి నలుగురూ పోగయారు. ఆ సాయంకాలం పదిమంది ఎరిగినవాళ్ళను వెంట బెట్టుకుని పొరుగువాడు శ్రేష్ఠి ఇంటి లోపలికి ప్రవేశించాడు. అటూ ఇటూ చూశాడు. ఇనప్పెట్టె కనిపించలేదు. అటకా, నిచ్చెనా కనిపించాయి. ఇనప్పెట్టె అటకమీద ఉన్నది. నిచ్చెన ఎక్కటానికి గాను పొరుగువాడు దాన్ని పట్టుకున్నాడు.

"శ్రేష్ఠీ, నిచ్చెనతాకాడు. ఇక అది నీది కాదు. పందెంలో నీవు ఓడావు," అన్నాడు ధర్మపాలుడు.

దీనికి పొరుగువాడు అభ్యంతరం చెప్పాడు. కాని అక్కడ చేరినవారంతా ధర్మపాలుడు చెప్పినది ధర్మమే నన్నారు. ఆయన ధర్మాన శ్రేష్ఠికి పెద్ద నష్టం తప్పింది.





విశ్వామిత్రుడు పుష్కరంలో చేసిన తపస్సుకు మెచ్చి ఒకనాడు బ్రహ్మ ప్రత్యక్షమై ఆయనకు ఋషి అనే బిరుదు ఇచ్చాడు.

దానికి కూడా తృప్తిపడక విశ్వామిత్రుడు మరింత దీక్షగా తపస్సు సాగించాడు. ఆ సమయంలో ఆయనకు ఒకనాడు ఒక తీర్థంలో స్నానం చేస్తున్న మేనక అనే అప్సరస కనిపించింది. మనస్సు చలించింది. ఆయన తన తపస్సు విడిచిపెట్టి మేనకను తన ఆశ్రమానికి తీసుకుపోయాడు. ఆమెతో పదేళ్ళు సుఖంగా గడిపాడు.

ఆ తరవాత ఆయనకు తన పొరపాటు తెలిసివచ్చింది. తన తపస్సు భంగం చెయ్యటానికి దేవతలు మేనకను పంపారేమోనను కున్నాడు. ఆయనలో మార్పు గమనించి, తనను శపిస్తాడేమోనని మేనక భయపడింది. కాని విశ్వామిత్రుడామెను ఏమీ అనక, "ఇందులో నీ తప్పేమీ లేదు, తప్పంతా నాది. ఇక నువు వెళ్ళిపో!" అన్నాడు.

ఆ తరవాత ఆయన ఉత్తర దిక్కుగా బయలుదేరి హిమాలయాలలో కౌశికీ నది తీరాన వెయ్యేళ్ళు మహా దారుణమైన తపస్సు చేశాడు. చివరకు బ్రహ్మ దేవతలతో సహా వచ్చి ఆయనకు మహర్షి అనే బిరుదు ఇచ్చాడు.

విశ్వామిత్రుడు బ్రహ్మను, "ఇప్పుడు నేను ఇంద్రియాలను జయించినవాణ్ణా?" అని అడిగాడు.

"ఇంకా నువు జితేంద్రియుడవు కావు," అన్నాడు బ్రహ్మ.



[illegible] విశ్వా[illegible] [illegible] ఘోర తపస్సు చేశాడు. ఆ తపస్సు చూసి [illegible] దేవతలకు [illegible].

[illegible] "[illegible] విశ్వామిత్రుడు [illegible] [illegible]. [illegible] నీకు [illegible] ధరించి [illegible] [illegible].

విశ్వామిత్రుడు [illegible] [illegible] [illegible] కళ్ళు తెరిచే [illegible] కనిపించింది.



ఇష్టంతా దేవతలు వన్నాగమని తెలుసుకున్నా, ఆయన రంభను రాయికమ్మని శపించాడు. ఇంద్రుడూ మన్మథుడూ పారిపోయారు.

[illegible] "అయ్యో, ఎందుకు శపించాను? కోపాన్ని ఎందుకు నిగ్రహించుకోలేక పోయాను?" అని పశ్చాత్తాపపడ్డాడు. ఎవరేమిచేసినా కోపపడరాదని ఆయన తీర్మానించుకున్నాడు. తపశ్శక్తిచేత బ్రాహ్మణత్వం సాధించితీరాలని నిశ్చయించుకున్నాడు.

ఈ ఉద్దేశంతో ఆయన ఉత్తరాన్ని విడిచి తూర్పు దిక్కుకుపోయి, మౌనవ్రతం అవలంబించి, తపస్సు సాగించాడు. ఆ తపస్సుయొక్క వేడికి మూడు లోకాలూ దగ్ధమయేటట్టు కనిపించింది. ఆ స్థితిలో దేవతలు మొరపెట్టుకోగా, బ్రహ్మ వచ్చి విశ్వామిత్రుణ్ణి, "బ్రహ్మర్షి, నీకు బ్రాహ్మణత్వం వచ్చింది," అన్నాడు.

విశ్వామిత్రుడు చాలా సంతోషించి, "నేను బ్రహ్మర్షినని వసిష్ఠుడు ఒప్పుకుంటేగాని తృప్తిపడను," అన్నాడు. దేవతలు వసిష్ఠుణ్ణి ప్రార్థించి ఆయన చేత విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అని ఒప్పించారు. వసిష్ఠ విశ్వామిత్రులకు కలహం పోయి స్నేహం ఏర్పడింది.

[illegible]

[illegible]

గురించి విశ్వామిత్రుడికి చెప్పాడు. దక్ష [illegible] ధనువును

ఎత్తి దేవతలను చంపబోయాడు. చివరకు [illegible] ఆ ధనుస్సును దేవతలకే ఇచ్చేశాడు. దేవ[illegible] కాలం నుంచి ఆ ధనుస్సు [illegible] ఉంటున్నది. [illegible]

[illegible]

చివరకు ఆ [illegible] మిథిలకు [illegible] క్షత్రియ రాజకుమారులను [illegible] పారదోలారు.

ఈ [illegible]

[illegible]

[illegible]

జనకుని మాటలు [illegible] ప్రయాణం [illegible], [illegible] అయోధ్యకు చేరి, దశరథుడితో [illegible] వృత్తాంతం చెప్పి, [illegible] వివాహానికి తరలిరమ్మని కోరారు.

దశరథుడు [illegible] తన మంత్రులతో సంప్రదించి, జనకమహారాజు [illegible] [illegible] ప్రయాణించాడు. [illegible] ప్రయాణమై, [illegible] దశరథుడు జనకుని [illegible] చేరాడు.

[illegible]

కీర్తి అను ఇద్దరు కూతుళ్లున్నారు. సీతా రాముల వివాహ ముహూర్తానికే లక్ష్మణుడికి ఊర్మిళనూ, భరతుడికి మాండవినీ, శత్రుఘ్నుడికి శ్రుతకీర్తిని ఇచ్చి పెళ్లి చేస్తే బాగుంటుందని జనకుడు భావించాడు. ఉత్తర ఫల్గుని నక్షత్రంలో ముహూర్తం నిశ్చయమయింది.

పెళ్ళికి ముందు దశరథుడు నాలుగు లక్షల గోవులను దానం చేశాడు. ఆ రోజునే భరతుడి మేనమామ అయిన యుధాజిత్తు కూడా మిథిలకు వచ్చాడు. అగ్నిసాక్షిగా నలుగురి వివాహాలూ జరిగిపోయాయి. దశరథుడి కొడుకులు నలుగురూ తమ భార్య



[illegible]

పరశురాముడు రాముడితో [illegible] ఇలా చెప్పాడు: [illegible] కర్మ స్వయంగా నిర్మించాడు. శివుని విల్లు లాగే ఇది ధనుస్సులలో శ్రేష్ఠమైనది. దేవతలు విష్ణువుకు ఇచ్చారు. శివవిష్ణువుల బలాబలాలు తెలుసుకునేటందుకు దేవతలు బ్రహ్మ ద్వారా ఇద్దరికీ కలహం పెట్టించారు. ఇద్దరికీ వెరొక గొప్ప విల్లూ ఉన్నది. [illegible] మహా భయంకరమైన యుద్ధం [illegible] ఆ యుద్ధంలో విష్ణువుదే పై చెయ్యి [illegible] ఆవకాశాలలో శివుడి [illegible] గ్రహించారు. యుద్ధం మానవలసిం[illegible] వేడుకొని ప్రార్థించారు. తరువాత విష్ణువు [illegible] ఎక్కువగా నిర్ణయం జరిగినందుకు [illegible] [illegible] తన ధనుస్సును [illegible] విదేహదేశ రాజైన దేవరాతుడు [illegible] విష్ణువు తన ధనుస్సును భృగువంశ [illegible] ఋచీకుడి వద్ద దాచాడు. ఆ ఋచీకుడి కొడుకైన జమదగ్నికీ, [illegible] కొడుకైన పరశురాముడికీ సంక్రమించింది.

[illegible] వెంట విష్ణువుని [illegible] [illegible]

[illegible] తాను తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోయాడు. [illegible] [illegible] [illegible] ఆ తరవాత [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ప్రళయకాల [illegible] పరశురాముడు వారికి ఎదురు [illegible] [illegible] [illegible] [illegible] రాముడితో, "శ్రీరామా.


SANKAR

[illegible]

[illegible] రాముడికి వచ్చింది. అతను పరశురాముడి నుంచి విష్ణుధనుస్సు తీసుకుని, అవలీలగా దాని ఎక్కుపెట్టి, బాణం సంధించి, "ఓ బ్రాహ్మణా, ఈ బాణంతో నీ ప్రాణం తీయగలను. కాని బ్రాహ్మణ హత్య నా కిష్టంలేదు. అందుచేత దీనితో నీ కాళ్ళు విరగగొట్టమన్నావా? నీవు సంపాదించిన ఉత్తమలోకాలు ధ్వంసం చెయ్యమన్నావా?" అని అడిగాడు.

పరశురాముడు నిర్వీర్యుడైపోయి [illegible] ఉత్తమలోకాలను [illegible]

[illegible] సత్కరించాడు. భరతుడు శత్రుఘ్నుణ్ణి వెంటబెట్టుకుని తన మేనమామ ఇంటికి వెళ్ళిపోయాడు.

సీతారాములు అన్యోన్య ప్రేమతో దాంపత్య జీవితం గడుపుతున్నారు. వారు తమ ప్రేమను పైకి చూపకపోయినా ఒకరి మనసు ఒకరు బాగా అర్థం చేసుకుంటున్నారు. రాముడు రాచకార్యాలలో తండ్రికి సహాయపడుతున్నాడు. రోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయి.

★ బాలకాండ సమాప్తం ★

మన దేశపు అద్భుతాలు:

అమరావతి

అమరావతి ఆంధ్రదేశంలోని గుంటూరుకు 22 మైళ్ళ దూరాన కృష్ణానది తీరాన ఉన్నది. సాతవాహనుల కాలంలో ఆంధ్ర రాజధానిగానూ, దక్షిణ భారతంలో మహాయాన బౌద్ధమతానికి కేంద్రంగానూ ఉండిన దాన్యకటక నగరపు శివార్లలో ఈ అమరావతి ఉండేది. భారత దేశంలోని ప్రముఖ బౌద్ధ కేంద్రాలన్నిటిని సందర్శించిన హియాన్ త్సాంగ్ అనే చీనా యాత్రికుడు 7 వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్నికూడా చూశాడు.

అమరావతి వద్ద బయటపడిన అద్భుతశిల్పాలు 2000 ఏళ్ళనాటివి. ఆ కాలపు ఆంధ్రుల అఖండ శిల్పసంపద వీటిలో కానవస్తుంది. ఇవి ఒక్క సారిగా బయటపడలేదు. 1797 లో మొదటి సారిగా ఇవి పాశ్చాత్యుల దృష్టిని ఆకర్షించాయి. అయినా ఈ శిథిల శిల్పాల చారిత్రక విలువ బయటపడేనాటికి అమరావతీ స్తూపం అనేది పూర్తిగా ధ్వంసమై పోయింది. ఈనాడు అమరావతీ శిల్పాలు కొన్ని లండనులోనూ, కలకత్తాలోనూ, మద్రాసులోనూ, అమరావతిలోనూ ఉన్నాయి. 2000 ఏళ్ళనాటి ఆంధ్రుల దుస్తులూ, అలంకరణలూ ఊహించటానికి ఈ శిల్పాలు సహాయకారిగా ఉన్నాయి.

అమరావతి వద్ద శిల్పఖండాలతోబాటు శాసనాలు కూడా దొరికాయి. వీటిలో కొన్ని మౌర్య లిపిలోనూ, కొన్ని సాతవాహనుల లిపిలోనూ, కొన్ని ఇక్ష్వాకుల లిపిలోనూ ఉన్నాయి. అందుచేత అమరావతీ స్తూపం మౌర్యుల నాటి నుంచి ఇక్ష్వాకులదాకా ప్రసిద్ధిలో ఉన్నదనుకోవచ్చు. ఈ స్తూపంయొక్క ఆకృతిని కర్నల్ కాలిన్ మెకంజీ అనే ఆయన అనేక ఆధారాలతో పునస్సృష్టి చేశాడు.





ప్రశ్నోత్తరాలు

1. మల్లెల శివరామ కృష్ణ, బొంబాయి - 22

మామయ్యా, "బాలకాండ" [ఆగస్టు]లో అహల్య ఎవరికీ కనబడకుండా ఆశ్రమంలో తపస్సమాధిలో ఉండిపోయినదని వ్రాసితిరి. నేను చదివిన రామాయణములో అహల్య రాయిగా మారిపోయినదనియు, రాముని పాద ధూళి తగులుటతో ఆమెకు శాపవిముక్తి కలిగినదని యున్నది. మరి ఏది నిజము?

ఈ సందేహాన్ని ఇంకా పదిమంది పాఠకులు వెల్లడించారు. రామ కథ అనేక పురాణాలలో ఉన్నది. రామాయణాలే అనేకంగా ఉన్నవి. మేము వాల్మీకి రామాయణాన్ని మాత్రమే అనుసరిస్తున్నాము. అహల్యకు గౌతముడిచ్చిన శాపం వాల్మీకి మాటలలో ఇది; "వాయుభక్షా, నిరాహారా, తప్యంతీ భస్మశాయినీ, అదృశ్యా సర్వభూతానా మాశ్రమేస్మి న్నివత్స్యసి." అహల్యను పాషాణికమ్మని గౌతముడు శపించినట్టు పద్మ పురాణంలో ఉన్నదట.

2. శాస్త్రి కనకదుర్గ, బెజవాడ

మామా, అట్ట వెనకనున్న మహాభారతము కొద్దిగానే వేయుచున్నారు. అది చాలటం లేదు. ఇంకొంచెం వేయకూడదా?

యుద్ధపర్వం చాలా పేజీలు వేసి వాటికి బొమ్మలు రాయించటం నిరుపయోగమనే ఉద్దేశంతో ఒక్క పేజీ మాత్రమే భారతానికి ప్రత్యేకించాము.

3. ఎల్. కస్తూరిబాయి, ఖమ్మంమెట్టు

చూడు, అన్నయ్యా! ఆ చందమామ యింత వెలుగు వెన్నెల ఇచ్చి బాటసారులకు, కష్టజీవులకు సహాయము చేస్తుంది. ఈ "చందమామ" ఎవరికి సహాయము చేస్తుంది?

ఆ చందమామ నెలనెలా కథలు చెబుతుందా? గేయాలు పాడుతుందా? ప్రశ్నలకు సమాధానాలిస్తుందా?

4. జి. ఉమాదేవి, విశాఖపట్నము

అన్నయ్యా, "దక్షయజ్ఞము" [ఆగస్టు] చివరి పద్యములో "ఉమను మోయుచు" అని వ్రాసినారు. కాని సతీదేవికి ఉమ అనే పేరు ఉన్నట్టు ఎక్కడా చదివినట్టు జ్ఞాపకము లేదు.

సతీదేవికి ఉమ అనే పేరు లేనిమాట నిజమే. అయినా సతీదేవే పార్వతిగా పుట్టిందని, ఆమెకు ఉమ అనే పేరుకూడా ఏర్పడిందనీ అనుకున్నాక సతినికూడా ఉమ అనటానికి కవికి స్వాతంత్ర్యం ఉన్నది. సతి చనిపోగానే ఆమెకు ఉమ అనే పేరు తగిలించటంలో స్వారస్యం లేదా?

5. కె. సుందరదేవి, పొదిలి

మామయ్యా, కశ్యపుడు మహాముని కదా దేవతగా చిత్రించారు. దితి ఎవరు? వారి వివాహము ఏ విధముగా అయినది?

కశ్యపుడు ప్రజాపతి. బ్రహ్మలాటివాడు. ఋషి కాడు. ఆయన దక్ష ప్రజాపతి కూతుళ్లను పన్నెండు మందిని పెళ్ళాడాడు. వారిలో రెండవది దితి.

6. కె. లక్ష్మణరావు, విజయవాడ

"చందమామ"కు మేము పంపే ప్రశ్నలకు జవాబు ఇవ్వకపోవటం అందులకు మేము అర్హులము కామని తమ ఉద్దేశ్యమా?

జవాబులు ప్రశ్నలనుబట్టి వస్తాయిగాని, ప్రశ్నించేవారి అర్హతలు సూచించే యంత్రా లేవీ మా వద్ద లేవే!

7. యస్. మనోహరరావు, నిజామాబాదు

మహాభారతం [ఆగస్టు]లో సహదేవుడు శకునిని చంపినట్లు వ్రాశారు. కాని నేను, భీముడు చంపినాడని మరొక పుస్తకంలో చదివాను. ఇది మీ పొరపాటా? లేక—


మా పొరపాటు కాదు.

8. పిప్పిక మల్లేశ్వరరావు, మోరి

గుండు భీమన్న కథలు ఎవరు ఎప్పుడు వ్రాసేరో తెలియజేస్తారా?

ఈ కథలు కర్ణాటక ప్రాంతంలో చాలా కాలంగా ప్రచారంలో ఉన్నాయి. ఎవరు రాశారో తెలియదు.

Photo by P. R. Shind



బహుమతి

కర్రలతో మేడ

పంపినవారు:

Photo by B. Bhansali



బహుమతి

పంపినవారు:

అట్టచివరి బొమ్మ

దుర్యోధనుడు మడుగులో ప్రవేశించాక సంజయుడు అక్కడినుంచి బయలుదేరాడు. కొద్దిసేపటికి ఆయనకు కృపుడూ, కృతవర్మా, అశ్వత్థామా ఎదురుపడి, దుర్యోధను డెక్కడ అని అడిగారు. దుర్యోధనుడు మడుగులో దాగిన సంగతి సంజయుడి వల్ల విని అశ్వత్థామ ఏడుస్తూ, "మే మింకా బతికి ఉన్నామని అతనికి తెలియదుగాబోలు. మేము ముగ్గురమూ, ఆయనా కలిసి వైరులను ఓడించి ఉందుమే," అన్నాడు.

తరవాత వారు సంజయుణ్ణికూడా ఒక రథంలోకి ఎక్కించుకుని శిబిరాలకు వచ్చారు. సూర్యాస్తమయం అవుతున్నది. చావగా మిగిలిన భటులూ, వృద్ధ సైనికులూ స్త్రీ జనాన్ని హస్తినాపురానికి తీసుకుపోతున్నారు. నిర్జనమైపోయిన శిబిరంలో ఉండటానికి మనస్కరించక కృప కృతవర్మాశ్వత్థామలు దుర్యోధనుడు దాగివున్న మడుగుకేసి వెళ్ళారు.

యుద్ధంలో తమకు జయం లభించినందుకు ధర్మరాజూ, ఆయన తమ్ములూ చాలా సంతోషించారు. దుర్యోధనుణ్ణి చంపే ఉద్దేశంతో వారు యుద్ధరంగమంతా తిరిగి, అతన్ని ఎక్కడా కానక తమ శిబిరాలకు తిరిగివెళ్ళారు.

తరవాత కృప కృతవర్మాశ్వత్థామలు మడుగు దగ్గిరికి వచ్చి ఎలుగెత్తి, "రాజా, బయటికి రా. నీ శత్రువులైన పాండవులతో యుద్ధంచెయ్యి. నీకు మేము ముగ్గురమూ అండగా ఉంటాం. గెలిస్తే రాజ్యం, చస్తే వీరస్వర్గం!" అని హెచ్చరించారు.

దుర్యోధనుడు "మనం అలిసిపోయి ఉన్నాం. ఈ రాత్రికి విశ్రమించి రేపు పాండవులతో యుద్ధం చేద్దాం," అన్నాడు.

కాని అశ్వత్థామ ఇప్పుడే యుద్ధం చేద్దామన్నాడు. శత్రుసంహారం చేస్తానని శపథాలు చేశాడు. మడుగులో నుంచి దుర్యోధనుడూ, వెలపల నుంచి అతని మిత్రులూ ఈ విధంగా మాట్లాడుకునే మాటలు కొందరు కటికవాళ్ళ చెవులపడ్డాయి. ఆ కటికవాళ్ళు నిత్యమూ భీముడికి మాంసం ఇచ్చేవాళ్ళు. వారు పాండవ శిబిరానికి వెళ్ళి, భీముడితో ఆ రహస్యం కాస్తా చెప్పేశారు. త్వరలోనే కృష్ణుడూ, ధర్మరాజూ, భీముడూ, మిగిలిన పాండవయోధులూ మడుగు వద్దకు వచ్చారు. వారు రావటం గమనించి కౌరవయోధులు ముగ్గురూ దూరంగా వెళ్ళిపోయారు. ధర్మరాజు దుర్యోధనుణ్ణి సూటిపోటి మాటలాడి రెచ్చగొట్టాడు. అందుకు ఫలితంగా దుర్యోధనుడు తన శత్రువులలో ఏ ఒక్కడితోనైనా గదాయుద్ధం చెయ్యటానికి పూనుకుని మడుగులో నుంచి పైకి వచ్చాడు. భీముడు దుర్యోధనుడితో యుద్ధంచెయ్యటానికి సిద్ధపడ్డాడు.

ఇంతలో బలరాముడు తీర్థయాత్రల నుంచి తిరిగి వచ్చాడు. తన శిష్యులైన భీమ దుర్యోధనులు గదా యుద్ధంలో తమ బలా బలాలను నిర్ణయించబోతున్నారని విని ఆయన కూడా మిగిలినవారితోబాటు ప్రేక్షకుడుగా ఉండటానికి ఒప్పుకున్నాడు. అప్పుడు భీమ దుర్యోధనులు గదాయుద్ధం ఆరంభించారు.

ఫొటో వ్యాఖ్యల పోటీ :: బహుమానం రు. 10 లు

ఈ ఫొటోల వ్యాఖ్యలు 1961 డిసెంబరు సంచికలో ప్రకటింపబడును.





* పై ఫొటోలకు సరిపడిన వ్యాఖ్యలు ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని కావాలి. (రెండు వ్యాఖ్యలకూ సంబంధం వుండాలి.)
* అక్టోబరు నెల 20-వ తేదీ లోగా వ్యాఖ్యలు మాకు చేరాలి. తరువాత చేరే వ్యాఖ్యలు ఎంత మాత్రమూ పరిశీలింపబడవు.
* మాకు చేరిన వ్యాఖ్యలలో అత్యుత్తమంగా వున్న సెట్టుకు (రెండు వ్యాఖ్యలకు కలిపి) రు. 10/లు బహుమానం.
* వ్యాఖ్యలు రెండూ పోస్టుకార్డుపైన వ్రాసి, ఈ అడ్రసుకు పంపాలి:- చందమామ ఫొటో వ్యాఖ్యల పోటీ, మద్రాసు-26.

అక్టోబరు నెల పోటీ ఫలితాలు

మొదటి ఫొటో: కర్రలతో మేడ

రెండవ ఫొటో: కష్టజీవుల నీడ

పంపినవారు: దేవ సుబ్బారావు,

పెద్దిపాలెం (P.O.) తూ. గోదావరి జిల్లా.

బహుమతిమొత్తం రు. 10/- ఈ నెలాఖరులోగా పంపబడుతుంది.

చిత్రకథ






ఒక రోజున దాసూ, వాసూలు తోటలో ఆడుకుంటూ వుండగా, గొర్రెలు కాచే కుర్రవాడు అక్కడికి వచ్చి, "నా పెంపుడు కోతి, పారిపోయిందనుకున్నారా? లేదు. అది నా దగ్గిరే వుంది. మాటలుకూడా నేర్పాను. వచ్చి చూడండి," అన్నాడు. దాసూ, వాసూలు వాడి వెంట వెళ్ళి, పొదల చాటున వున్న కోతిని, "నీ పేరేమిటి?" అని అడిగారు. పొదల్లో నుంచి 'సోములు' అన్న జవాబు వచ్చింది. ఈలోపల టైగర్ పొదల్లో జొరబడింది. ఆ వెంటనే, "టైగర్, నా కాలు కొరుకుతున్నదిరో, అన్నో!" అంటూ అరిచి, గొర్రెలు కాచే కుర్రవాడి తమ్ముడు పొదల్లో నుంచి బయటికి దూకి పరిగెత్తసాగాడు. దాసూ వాసూలు నవ్వుకున్నారు.






Printed by B. NAGI REDDI at the B. N. K. Press Private Ltd.,











'నాలుగు 'వానవెల్లి'
రంగులలో
వచ్చింది - నాలక్స్
... తెలుపులో
కూడా!'

అని ఎమ్.ఎస్.రాజమ్
చెప్పుచున్నది

అక్టోబర్ సంచిక వెలువడింది!

యువ

(సచిత్ర మాసపత్రిక)

విడి ప్రతి రు. **0-75** :: సాలు చందా రు. **9-00**

ఈ సంచికలో

ఇవి గాక చీకటిగదులు (సీరియల్), మతములు-ప్రవక్తలు, పని లేని మంగలి, చిత్ర పరిచయ పోటీ, సినిమా క్విజ్ మొదలయిన ఎన్నో ఆకర్షణలు

కాపీ మీ ఏజంటు నడగండి

★

దీపావళి ప్రత్యేక సంచిక (నవంబరు '61)

మామూలుకు రెట్టింపు (¼ డెమీ) సైజులో—సుమారు 200 పేజీలతో—ఆర్టుబోర్డు అట్టతో అత్యంత మనోహరంగా అక్టోబరు 20వ తేదీకే వెలువడుతున్న ఈ ప్రత్యేక సంచిక ఎంతో విశిష్టంగా వుంటుంది.

కాపీ వెల రు 2—00 మాత్రమే.

రు 2—25లు పంపినవారికి కాపీ రిజిస్టర్డు పోస్టులో పంపబడును.

వివరాలకు

యువ కార్యాలయం

పబ్లిక్ గార్డెన్ రోడ్ :: హైదరాబాదు-1.



